# జీడీపీ ఎడమ కాలువకు నీటిని.. విడుదల చేసిన జాయింట్ కలెక్టర్



**గోనెగండ్ల, డిశంబరు, 4, ప్రభాతవార్త**

గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాలువ కింద ఉన్న ఆయకట్టు భూములకు రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకునేందుకు గాను గురువారం జాయింట్ కలెక్టర్ నూరుల్ కమల్ ఎడమ కాలువ నీటిని విడుదల చేశారు.నీటి విడుదల పూజా కార్యక్రమంలో జీడీపీ సాగునీటి సంఘం అధ్యక్షుడు మల్లికార్జునగౌడ్, మండల టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్యనాయుడు పాల్గొన్నారు.ఎడమ కాలువ ద్వార ప్రస్తుతం రైతుల అవసర నిమిత్తం 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.ఎడమ కాలువ కింద 3,500 ఎకరాలు సాగు కావాల్సి ఉంది.అయితే ఈఏడాది దాదాపు 1300 నుంచి 1400 ఎకరాలులోపు సాగు కవచ్చునని అధికారులు తెలుపుతున్నారు.అనంతరం జాయింట్ కలెక్టర్ నూరుల్ కమల్ ప్రాజెక్టులో ఎన్ని టీఎంసీల నీరు ఉన్నది.ఎన్ని ఎకరాలకు సాగు నీరు అంది ంచవచ్చును ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలు ఎన్ని,ఎన్నివేల ఎకరాలు ప్రాజెక్టు విస్తరించి వున్నది అని ఏఈ మహమ్మద్‌ఆలీని అడిగి తెలుసుకున్నారు. ఆయకట్టు రైతులకు రబీ,సీజన్‌లో సాగునీటి సమస్య రాకుండా చూడాలని ఇరిగేషన్ అదికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజేశ్వరి,ఉగ్రనరసింహుడు,హెచ్ కైరవాడి సహకార సంఘం అధ్యక్షుడు తిమ్మారెడ్డి,రాజేష్ టీడీపీ నాయకులు,రైతులు పాల్గొన్నారు.

## పాలనా సౌలభ్యం కోసం..

# నూతన కార్యాలయాలు

**: డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ప్రారంభించిన డీసీఎం పవన్ కళ్యాణ్**



**కర్నూలు, డిసెంబర్ 04, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో పాలనా సౌలభ్యం పెంపు, గ్రామీణ స్థాయిలో ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం లక్ష్యంగా ప్రభుత్వం డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ఏర్పాటు చేసిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. గురువారం చిత్తూరు నుండి రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించగా, కర్నూలు జిల్లా పరిషత్‌లో ఏర్పాటైన కొత్త కార్యాలయాన్ని కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే చరితా రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామస్థాయిలో రోడ్లు, త్రాగునీరు, వీధిదీపాలు వంటి సమస్యలు విస్తృతంగా ఉండటంతో, జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా డివిజన్ స్థాయిలోనే వాటి పరిష్కారం జరిగేలా ఈ కార్యాలయాలు ఉపయోగపడతాయని తెలిపారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని డివిజన్లలో ఏర్పాటు చేసిన కార్యాలయాల ద్వారా డివిజనల్ అభివృద్ధి అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించే అవకాశం లభిస్తుందని వివరించారు. పాణ్యం ఎమ్మెల్యే చరితా రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ రాజ్ శాఖకు సర్వాధికారాలు లభించాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 13,226 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయడం రికార్డు అని తెలిపారు. గ్రామాల్లో డ్రైనేజ్, త్రాగునీరు, రోడ్లకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తూ దశలవారీగాఅభివృద్ధి కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీ రాజ్ వ్యవస్థ, గ్రామీణాభివృద్ధి బలోపేతానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ స్థాయిలో సీసీ రోడ్లు, త్రాగునీరు వంటి పనుల చేపట్టడంతో గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ఏర్పాటు పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసర రెడ్డి, డిపిఒ భాస్కర్, డీఎల్డీవో రమణారెడ్డి, డ్వామా పీడి వెంకట రమణయ్య, డిఆర్డిఏ పీడి రమణారెడ్డి, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# రాయల్టీ వేబిల్లుల్లో.. భారీ కుంభకోణం..!?

- అధికార యంత్రాంగం బ్రోకర్ల వాటాల పంపకాలతో ప్రైవేట్ పరమా?
- ఎలాంటి డ్రస్‌కోడ్ లేకుండా స్వాడ్ పేరుతో సీనరైజ్ గుత్తేదారుల తనిఖీలు
- సమగ్ర విచారణ చేపడితే రూ.కోట్లలో కుంభకోణం బయటపడుతుందేమో





**బేతంచెర్ల, డిసెంబరు 4, ప్రభాతవార్తః**

రాష్ట్రంలో ఖనిజాల ఖిల్లాగా పేరొందిన ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాయల్టీలు, వేబిల్లులు ప్రైవేట్ పరం చేయడంపై వాహనదారులు, గని ఓనర్లు గుత్తేదారుల మధ్యత రోజు రోజుకు రచ్చ జరుగుతుంది. బేతంచెర్ల, డోన్, కొలిమిగుండ్ల, బనగానపల్లె మండలాలతో పాటు పలు మండలాల్లో నాపరాయి, సున్నపురాయి, బలపం రాయి డోలామైట్, వైట్‌షెల్, రంగురాళ్లు ఇతర ఖనిజాలు పుష్కలంగా లభిస్తున్నాయి. వీటిని తవ్వి తీసేందుకు ఇతర ప్రాంతాలకు తరలించేందుకు గనులశాఖ అనేక నిబంధనలు రూపొందించి వీటి ద్వారా వచ్చే ఆదాయవనరులతో ప్రజా సంక్షేమానికి ఆయా ప్రాంతాల అభివృద్ధికి వినియోగించడం జరుగుతుంది. ఈనేపథ్యంలో రాయల్టీలు, వే బిల్లులు ఖనిజాల బరువును బట్టి విధించడం జరుగుతుంది. అయితే గత కొంతకాలంగా ప్రభుత్వ యంత్రాంగం బ్రోకర్లు రాయల్టీ, వే బిల్లుల ద్వారా వచ్చే ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ రిస్క్‌పేరుతో చెక్‌పోస్టులను దాటిస్తు కోట్ల రూపాయలు దండుకుంటున్నట్లు నిఘా వర్గాల ద్వారా అందిన సమాచారంతో ప్రభుత్వాలు ప్రైవేట్ వ్యక్తులకు సీనరైజేషన్ కలెక్షన్ చేసుకునే అవకాశాన్ని టెండర్ల ద్వారా కల్పించడం జరిగింది. పలు కారణాల చేత ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈవిధానం అలస్యంగా అమలులోకి వచ్చింది. వచ్చినప్పటి నుండి గతంలో బ్రోకరైజ్ చేసి వే బిల్లులు, రాయల్టీలు లేకుండా చెక్‌పోస్టులను దాటించిన వ్యక్తులతో పాటు ప్రైవేట్ గుత్తేదారులు విధిస్తున్న బిల్లుల మోత అధికమయిందని అందోళనలు చేయడం వాహనాలను నిలిపివేయడం వివిధ రకాల రాజకీయ ఒత్తిళ్ళను గుత్తేదారులపై తీసుకురావడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఇటీవల కొలిమిగుండ్ల, బనగానపల్లె, ఇతర మండలాల్లో పలుసంఘటనలు చోటుచేసుకున్నాయి. బేతంచెర్లలోను ఇలాంటి సంఘటనే ఈనెల 3న రాత్రి చోటుచేసుకుంది. ఐదు నాపరాయి లారీలను రిస్క్‌టీమ్‌లు బిల్లులు చెక్‌పోస్టు వద్ద తనిఖీచేయించుకోకుండా దాటించేందుకు యత్నించారు. చాలకాలంగా వేచివున్న సీనరైజ్ కలెక్షన్ గుత్తేదారుల ప్రతినిధులు స్వాడ్‌పేరుతో ఆ లారీలను స్వాధీనం చేసుకొని పోలీసులు ద్వారా స్టేషన్‌కు తరలించారు. ఈఘటనతో నాలుగైదేళ్లుగా రిస్క్‌పేరుతో కొంతమంది వ్యక్తులు బ్రోకర్లుగా మారి కోట్ల రూపాయలు దండుకొని ఖనిజ వాహనాలను చెక్‌పోస్టులు దాటించినట్లు బహిర్గతం అవుతుంది. దీనిపై సమగ్ర విచారణచేస్తే కోట్ల కుంభకోణం వెల్లడవడంతో పాటు ఏవరేవరికి ఏ స్థాయిలో ఎంతెంత వాటాలు పంపకం అయ్యాయో బయటకు వస్తాయని పలువురు భావిస్తున్నారు. ఈనేపథ్యంలోనే నిఘావర్గాల సమాచారం మేరకు ప్రభుత్వం సీనరైజేషన్ కలెక్షన్‌ను గుత్తేదారులకు అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం. ఏది ఏమైనా ప్రజాసంక్షేమం కోసం ఉపయోగపడే ఖనిజ సంపదపై ఆదాయాన్ని రాబట్టడంలో ప్రభుత్వ యంత్రాంగం మరింత నిఘాపెంచి గతంలో కోట్ల కొల్లగొట్టిన వారి నుండి రికవరీచేసే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. స్వాడ్ పేరుతో సీనరైజేషన్ కలెక్షన్ గుత్తేదారుల ప్రతినిధులు ఎలాంటి డ్రస్‌కోడ్ లేకుండా వాహనాలను తనిఖీలు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీటిపై కూడ ప్రత్యేక దృష్టిసారించడం వల్ల అక్రమాలతో పాటు భవిష్యత్తులోజరిగే అరాచకాలకు అడ్డుకట్ట వేసినవారు అవుతారని భావిస్తున్నారు. అలాగే సీనరైజేషన్ కలెక్షన్ గుత్తేదారులకు ప్రభుత్వం ఇచ్చిన హక్కుల వివరాలను గని యజమానులు, వాహన యజమానులకు విస్తృతంగా వివరించడం వల్ల అటు గుత్తేదారులకు, ఇటు వాహనదారులకు, గని యజమానులకు మధ్య రోజు రోజు రగులుతున్న రగడకు స్వస్తిపలికినట్లు అవుతుందని పలువురు భావిస్తున్నారు. ఏది ఏమైనా మైనింగ్ ఉన్నతాధికారులు ప్రభుత్వం ఈరాయల్టీలు, వే బిల్లుల రగడకు స్వస్తిపలికేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రాయల్టీలు, వే బిల్లులు స క్రమంగా లేని ఐదు నాపరాయి లారీలు సీజ్‌: బేతంచెర్ల నుండి నాపరాయి తరలిస్తున్న ఐదులారీలను సీజ్ చేసినట్లు మైనింగ్ విజిలెన్స్ అధికారులు సాంబశివారెడ్డి, దిలిఫ్‌కుమార్‌లు గురువారం తెలిపారు. ఎలాంటి వే బిల్లులు, రాయల్టీలు లేకుండా చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేయించుకోకుండా వెళ్తున్న ఐదు నాపరాయి లారీలను సీనరైజేషన్, కలెక్షన్ స్వాడ్ పోలీసులు ఈనెల 3న రాత్రి పట్టుకొని తమకు స్వాధీనం చేయడం జరిగిందని వాటి రికార్డులను సంబంధిత బిల్లులను పరిశీలిస్తామని వారు తెలిపారు. సీజ్‌చేసిన లారీలను బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

## మా సమస్యను పరిష్కరించే..

# నాథుడే లేడా..!?

**– జాయింట్ కలెక్టర్ కారును అడ్డుకున్న ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, గోనెగండ్ల రైతులు**



**గోనెగండ్ల, డిశంబరు, 4, ప్రభాతవార్త :**

ప్రతి ఏడాది ఆయకట్టు పొలాలు నీటి మునిపోతున్నాయి.ఏ నాయకుడు,అధికారి మా కష్టం తీర్చలేదు.ప్రతి ఏడాది రబీలో సాగు చేసుకున్న పంటలు నీట మునుగుతున్నాయి.ఖరీఫ్ సాగు చేసుకునే ందుకు వీలు లేదు.మా సమస్యలను పరిష్కరించి వెళ్లాలని ఐరన్‌బండ,ఎన్నెక ండ్ల,గోనెగండ్ల గ్రామాలకు చెందిన జీడీపీ ఎగువ ప్రాంత ఆయకట్టు రైతులు దాదాపు 100 మంది జాయింట్ కలెక్టర్ నూరుల్ కమల్ కారు ముందు బైఠాయించారు.కారును అడ్డుకున్నారు.గాజులదిన్నె ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టు నీటి నిలువ కారణంగా 200 ఎకరాలు ఆయకట్టు భూములు మునిగి పోతున్నాయని రైతులు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేయడంతో గురువారం జాయింట్ కలెక్టర్ నూరుల్ కమల్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని ఆయకట్టు భూములలో ఆయన పర్యటించారు.నీట మునిగిన పొలాలు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ వాహనంను రైతులు అడ్డగించి ముట్టడించారు.గత కొన్నేళ్లుగా సమస్య ఉంది.ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు,నాయకులు ముందుకు రావడం లేదని రైతులు జాయింట్ కలెక్టర్‌తో వాదనకు దిగారు.ఆయకట్టు రైతులు నాజీర్‌సాహెబ్,రమేష్‌నాయుడు,మాజీ సర్పంచ్ బజారి,వీరేష్, నాగరాజు సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతూ జీడీపీ అధికారులు 376 మీటర్ల వరకు నీటిని నిలువ చేస్తే కొంత భూమి మాత్రమే నీట మునుగుతుంది.అలా కాదని 377 మీటర్లు వరకు నీటి నిలువ చేస్తే దాదాపు 200 ఎకరాలు వరకు ఆయకట్టు భూమి నీట మునుగుతుందన్నారు.ఈ ఏడాది 377 మీటర్ల వరకు నీటిని నిలువ చేయడంతో గోనెగండ్ల,ఐరన్‌బండ,ఎన్నెకండ్ల,తదితర గ్రామాల రైతులు సాగు చేసుకున్న పత్తి,మిరప,వేరుశనగ,ఉల్లి,మొక్కజోన్న పంటలు దాదాపు 180ఎకరాలలోని పంట నీట మునిగి దాదాపు రూ.2కోట్ల మేర పంట నష్టం జరిగిందని జాయింట్ కలెక్టర్‌కు వివరించారు.భూమిని సర్వే చేయకుండా భూమిని రైతులతో కోనుగోలు చేయకుండా నీటిని ఎట్లా నిలుపుతారని వారు ప్రశ్నించారు. జీడీపీ కట్ట ఎత్తు పెంచుతుండటంతో నీటి నిలువ శాతం కూడా ఒక టీఎంసీ పెరగనుంది కావున అందుకు గాను అదనంగా 627 ఎకరాల భూసేకరణ చేయాలి ్సందని అందుకు గాను భూమి కోల్పోయిన రైతులకు భూమికి బదులు భూమితో పాటు జీవో నెం.98 ప్రకారం భూమి నష్టపోయిన రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ్యం ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు.ఇందుకు స్పందించిన జాయింట్ కలెక్టర్ నూరుల్ కమల్ మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు 376 మీటర్లు లోపే నీటిని నిలుపే విధంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అదికారులను ఆదేశించారు.భూమి కొనుగోలుకు సంబందించిన ఫైల్ కలెక్టర్ కార్యాలయం నందు ఉందని దాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజేశ్వరి,ఎంపీడీవో మణిమంజరి,ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, జీడీపీ డీఈ సుబ్బరాయుడు,ఏవో హేమలత,ఏఈ మహమ్మద్ ఆలీ, పాల్గొన్నారు.

# అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అంకితం : మంత్రి బీసీ

**: డోన్‌లో డిఎల్ డివో ఆఫీస్‌ను ప్రారంభించిన మంత్రి**

**డోన్, నవంబర్ 4, ప్రభాతవార్త :**

డోన్ పట్టణంలో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు. వర్తువల్ విధానంలో కార్యాలయాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి మరియు డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పవన్ కళ్యాణ్ ప్రారంభించినట్లు వీడియో ద్వారా తెలియజేశారు అనంతరం మంత్రి బీసీ ఆఫీసుకు రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ ప్రాంతీయ ప్రజలకు పరిపాలనా సేవలను వేగవంతంగా, సమర్థవంతంగా అందించేం దుకు ఈ కార్యాలయం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రారంభోత్సవ వేడుకలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, కర్నూలు డిసి ఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు లక్కా సాగరం లక్ష్మిరెడ్డి, బిజెపి నాయకులు సందు రమణతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్ రెడ్డి కార్యాలయం ద్వారా అభివృద్ధి పనుల సమన్వయం, ప్రజా సేవల పర్యవేక్షణ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అనంతరం అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మల్లికార్జున కుమ్మరి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గార్లదిన్నె సుధాకర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు ప్యాపిలి ప్రభాకర్ రెడ్డి మాజీ ఎంపీపీ తొప్పల శ్రీనివాసులు చనగుండ్ల శ్రీరాములు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# అభివృద్ధి డివిజన్‌స్థాయిలో.. సేవలు అందుబాటు

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల, డిసెంబరు 4, ప్రభాతవార్త ప్రతినిధిః**

అభివృద్ధి శాఖలను డివిజనల్ సా ్థయిలో తీసుకువచ్చి ప్రజలకు త్వరితగతిన సేవలందించడమే ప్రధాన డివిజనల్ అభివృద్ధి కార్యా లయాలను ప్రభుత్వం తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొనా ్నరు. గురువారం పట్టణంలోని రైతు నగర్‌లో డివిజనల్ అభివృద్ధి కారా ్యలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి శాఖలను డివిజన్‌స్థాయిలో పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ పరిపాలనా పరిధిలోకి తీసుకువడం వలన సేవలు అందుబాటు పెరగడమే కాకుండా గ్రామీణాభివృద్ధికి వేగం చేరుతుందన్నారు. ప్రజలకు త్వరితగతిన సేవలు, మెరుగైన పర్యవేక్షణ పారదర్శకత పెరుగుతుందన్నారు. అలాగే ఈ కార్యాలయం ద్వారా మిషన్ విభాగాల మధ్య సమన్వయం బలోపేతం కావడంతో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు మరింత ప్రభావంతంగా అమలు కావచ్చునా ్నరు. ఈకార్యక్రమంలో డివిజనల్‌స్థాయి అధికారులు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# సీఎంను కలిసిన.. జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

**కర్నూల్ హాస్పిటల్ డిసెంబర్ 4 ప్రభాతవార్త:**

కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ పాలకుర్తి తిక్కారెడ్డిఈరోజు తేదీ4న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ని కలవడం జరిగినది ఈ సందర్భముగా వారు జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితిని గురించి అధ్యక్షుల వారితో కూలంకుషంగా వివరించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ముఖ్యంగా ఆదోని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని స్థానిక నాయకులు ఆందోళనలు చేపట్టారని అధ్యక్షులు తిక్కా రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి వివరించారు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా అధ్యక్షులు తిక్కా రెడ్డి తో మాట్లాడిన సందర్భంగా ఈ విషయము ఇప్పటివరకు నా దృష్టికి ఎవ్వరూ తీసుకొని రాలేదని ముఖ్యమంత్రి చెప్పారు ప్రత్యేక ఆదోని ప్రత్యేక జిల్లా చేస్తామని మనము ఎన్నికలకు ముందు హామీ ఏమైనా ఇచ్చామ అని శ్రీ తిక్క రెడ్డి ని ప్రశ్నించగా ఎన్నికలకు ముందు ఇలాంటి డిమాండ్ ఆదోని ప్రాంతంలో రాలేదని, అందువల్ల అప్పుడు అక్కడ ఎలాంటి హామీని ఇవ్వలేదని చంద్రబాబు నాయుడు దృష్టికి తెలియజేశారు. అప్పుడు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు కర్నూలు జిల్లా మంత్రివర్యులు జిల్లాఇన్చార్జి మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జోనల్ ఫైవ్. ఇంచార్జి పార్లమెంటు సభ్యులు శాసనసభ్యులు నియోజకవర్గ ఇన్చార్జిలు పార్టీకి చెందిన నాయకులు అందరూ కలిసి చర్చించుకుని విషయాన్ని నా దృష్టికి తీసుకొని రావలసినదిగా ముఖ్యమంత్రి తెలియపరిచార ని జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి వివరించారు. ఈరోజు తిక్కా రెడ్డి తో పాటు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మంత్రాలయం నియోజకవర్గం నాయకులు చిన్న బసప్ప ఉన్నారు



# విద్య, వైద్యం, విద్యార్థుల భవిష్యత్తు రక్షణ కోసం



**కర్నూలు అర్బన్ నవంబర్ 4 ప్రభాతవార్త:**

కోటి సంతకాల సేకరణ కార్యక్రమం 50వ వార్డులో, ముఖ్య అతిథులుగా పాల్గొన్న వైఎస్సార్సీపీ స్టేట్ మహిళ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ ఎస్.టి. షేక్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, వైద్యం, విద్యార్థుల భవిష్యత్తు రక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న కోటి సంతకాల ఉద్యమంలో ప్రజల హక్కులను కాపాడేందుకు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు తెలిపారు. వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పడుతుందని, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయకుండా కోటి సంతకాల కార్యక్రమంలో అవగాహన కల్పిస్తూ స్వచ్ఛందంగా పాల్గొనాలని ప్రజలకు ఆమె తెలిపారు.కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్.టి. షేక్ అహ్మద్, పార్టీ నాయకులు, మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# హెల్మెట్ లేని ప్రయాణం.. ప్రమాదకరం

**: హెల్మెట్ ధరించండి సురక్షితంగా ప్రయాణించండి .**

**: రహదారి భద్రత మన జీవితాలకు రక్షణ**

**కర్నూలు డిసెంబర్ 04 ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు పోలీసు అధికారులు, సిబ్బంది ఆయా పోలీసుస్టేషన్లల పరిధులలో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయడం పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విస్తృతంగా హెల్మెట్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తలకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచిస్తున్నారు. హెల్మెట్ కొని తెచ్చుకుని ధరించి వాహనం నడిపే విధంగా అవగాహన చేస్తున్నారు.తప్పనిసరి పరిస్థితులలో జరిమానా విధిస్తున్నారు.రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధారణ చేయకపోవడం వలననే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని, తమ విలువైన ప్రాణాలు కాపాడు కోవడానికి హెల్మెట్ చాలా అవసరమని, ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని తెలియజేస్తూ పోలీసులు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణం చేస్తే సురక్షితమని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని తెలియజేస్తున్నారు.







# అంగరంగవైభవంగా కాశీనాయన జ్యోతుల మహోత్సవం

– ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కోలాటం





**బండిఆత్మకూరు, డిసెంబరు 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని జి లింగాపురం గ్రామంలో కార్తీకమాసం అనంతరం సుదీరమ్మ అమ్మవారు ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సహాకారంతో శ్రీకాశీనాయన జ్యోతుల మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఈ సంవత్సరం కూడ జ్యోతుల మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఉదయం శ్రీకాశీనాయన దేవస్థానం అవరణలో సుదీరమ్మ అమ్మవారు ఆధ్వర్యంలో ప్రత్యేకహోమం కార్యక్రమం, పూజలు నిర్వహించారు. ఈహోమం కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం హోమాలు ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం కాశీనాయన గ్రామోత్సవ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో గోవిందపల్లెకు చెందిన మహిళల కోలాటం ప్రత్యేక అకర్షణగా నిలిచింది. గ్రామోత్సవంలో కాశీనాయనను భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 12 గంటల సమయంలో జ్యోతుల మహోత్సవంతో కార్య క్రమం ముగిసింది. మండలంలో ఎక్కడా ఏ గ్రామంలో లేనివిధంగా లింగాపురం గ్రామంలో సుదీరమ్మ అమ్మవారి ఆశీర్వాదం, గ్రామ ప్రజల సహాకారం కాశీనాయన జ్యోతుల కార్యక్రమం నిర్వహించడం విశేషం. ఈసందర్భంగా గ్రామంలో ప్రతిఇంట బంధువుల సందడితో ఆనందంగా గడిపారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి చెన్నా సుమలతకు డాక్టరేట్



**నందికొట్కూరు, డిసెంబరు 4, ప్రబాతవార్త:** స్తానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకురాలు చెన్నా సుమలత కు భౌతిక శాస్త్ర విభాగం నందు డాక్టరేట్ లభించింధి. వడ్డేశ్వరంలోని కెఎల్ విశవ్వ విద్యాలయం ప్రొఫెసర్ ఎమ్.వెంకటేశ్వర్లు పర్యవేక్షణంలో సుమలత ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ది చేంజ్ ఇన్ స్ట్రక్చరల్ ల్యూమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ డై స్ప్రోజియం, టెర్బియం డైస్ప్రోజియం –టెర్బియమ్ అయాన్ డోప్డ్ జింక్, బిస్మత్, బేరియం, బోరో ఫ్లోర్ టెల్యూరైట్ గ్లాసెస్ ఫర్ లేజర్ అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధన చేసి రాయలసీమ కెఎల్ విశ్వవిద్యాలంలో తన పిహెచ్‌డీ థీసీస్‌ను సమర్పించి నందుకు గాను విశ్వ విద్యాలయయం సుమలతకు డాక్టరేట్ ప్రధానం చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ రంగముని తెలిపారు. గురువారం కళాశాలలో అధ్యాపకులు ఆమె ఘనంగా సన్మానించారు.

## రోడ్డు ధిగ్బంధన కార్యక్రమాన్ని జయప్రం చేయండి



**ఆస్పరి, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రైతుల సమస్యలు పరిష్కారించాలని డిసెంబరు 10వ తేదీన ఆస్పరి చౌరస్తాలో చేపట్టే రోడ్డు ధిగ్బంధన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, మండల సమాయ కార్యదర్శి కృష్ణమూర్తి పిలుపు నిచ్చారు. గురువారం మండల కేంద్రమైన ఆస్పరిలో సిపిఐ పార్టీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతు రైతు పండించిన పత్తి పంటను క్వింటాల్ రూ.12 వేలతో ప్రభుత్వమే సీసీఐ ద్వారా పత్తి పంటను కొనుగోలు చేయాలన్నారు. అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు పంట నష్ట ఇవ్వాలన్నారు. అనేక సమస్యల పరిష్కారానికై చేపట్టే రోడ్డు ధిగ్బంధనను జయప్రదం చేయాలని, ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ పాల్గొంటారని కావున రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. సిపిఐ సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, హానుమంతు, చంద్రశేఖర్, రామాంజి, కృష్ణా, పాండు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విధానాలతో విద్యా ప్రైవేటీకరణ




**ఆలూరు, డిసెంబరు 4, ప్రభాతవార్త:** ప్రభుత్వ విధానాలతో విద్య ప్రైవేటీకరణ. విద్యా ఉపాది లేక వలస బాటలో పశ్చిమ ప్రాంతం మని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. గురువారం ఎస్ఎఫ్ఐ 50వ కర్నూలు జిల్లా మహాసభలలో భాగంగా ఆలూరు పట్టణంలోని ప్రభుత్వ కళాశాల నుండి వేలాది మంది విద్యార్థులతో మహా ప్రదర్శనను నిర్వహించారు. ప్రదర్శన అగ్రభాగాన 50 పతాకాలతో విద్యార్థులు ముందు నడవగా రాష్ట్ర జిల్లా నాయకత్వంలో విద్యార్థులు కదనం తొక్కుతూ పెద్ద పెట్టున నినదిస్తూ పాత బస్టాండు సెంటర్లో బహిరంగ సభను నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన చేసి విగ్రహానికి పూలమాలలు వేసి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయయి ఉదయ్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్వి ప్రసన్నకుమార్, రాష్ట్ర ఉపాధ్యాక్షుడు పరమేష్, జిల్లా కార్యదర్శిశ ఎం.కంగప్ప, మాజీ జిల్లా కార్యదర్వి ఎం.డి.ఆనందబాబు, ఆహ్మాన సంఘం అధ్యక్షులు మల్లేష్, జిల్లా నాయకులు మైనా, బాలికల కన్వీనర్ సంయుక్త ప్రసంగించారు. మండలాలలో మహిళా విదార్థులకు హాస్టల్ ఏర్పాటు చేయాలని, అనేక సార్లు పోరాటాలు చేశామని, ఈ మహాసభలలో జిల్లా విద్యారంగం విద్యార్థుల సమస్యలపై మహాసభలలో తీర్మానం చేసి భవిషత్తు కార్యాచరణ రూపొందిస్తామని వారు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు శ్రీనువాసులు, సంయుక్త, జిల్లా సమాయ కార్యదర్శి గోవర్ధన్, మండల అధ్యక్షులు లక్ష్మినారాణ, ఉమేష్, నారాయణ స్వామి, హానుమంతు, గిరి, షాకీర్, తిక్కస్వామి, మురళీ, శ్రీరామ్, థామస్, సురేష్ పాల్గొన్నారు.

## భూసార ఆరోగ్యము పై శిక్షణా కార్యక్రమం



**జూపాడుబంగ్లా, డిసెంబరు 4, ప్రభాతవార్త:** స్తానిక మండల కేంద్రంలోని డా.బి.ఆర్.అంబేద్కర్ గురుకులం విద్యార్థులకు భూసార ఆరోగ్యముపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం నంద్యాల డిడిఏ మద్దిలేటి మాట్లాడుతు విద్యార్థులు చిన్నప్పటి నుంచే వ్యవసాంపై అవగామాన పెంచుకోవాలని అలాగే నేల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని తెలిపారు. నేల రకాలను గురించి విద్యార్థులకు వివరించ,ఆరు. ప్రస్తుతం నేల ఆరోగ్యము పెంచుకోవడానికి సేంద్రియ ఎరువులు జీవన ఎరువులు విరివిగా వాడాలని సతెలిపారు. భూసార పరీక్ష అవశ్యకతనుమరియు లభాల గురించి విద్యార్థులకు తెలిపారు. మట్టి నమూనాలు ఏ విధంగా తీసి ల్యాబ్‌కు పంపాలో తెలియజేసి విద్యార్థుల చేత మట్టి నమూనాలను తీపించి చూపించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారగా ఎరువులు వాడకం ద్వారా వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకోవచ్చునని అలాగే నేల కాలుష్యాన్ని తగ్గించుకోవడం ద్వారా మానవాళి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. బిటియం ఉమామహేశ్వరి, వ్యవసా సహాయ సంచాలకులు గిరీష్, ఏవో కృష్ణారెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి బిచ్చారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాణమూర్తి పాల్గొన్నారు.

## ఎస్సీ కాంప్లెక్స్‌ను తనఖీ చేసి ఏఈ మహమ్మద్‌ఎజాస్

– కాంప్లెక్స్ రూముల మరమ్మత్తులకై నిధులు మంజూరు



**ఆదోనిలీగల్, డిసెంబరు04, ప్రభాతవార్త;** ఆదోని పట్టణంలోని ఎస్సీ కాంప్లెక్స్‌ను తనఖీ చేసి ఏఈ మహమ్మద్‌ఎజాస్ గురువారం తనిఖీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన ఎస్సీ కాంప్లెక్స్‌ల్లో ఉన్న రూముల మరమ్మతుల కోసం నిధులు మంజూరైన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సంబంధించి ఏఈ మహమ్మద్‌ఎజాస్ పట్టణంలోని ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ రూములను తనిఖీ చేసి, కాంప్లెక్స్‌లో ఉన్న 9 రూములను పరిశీలించి, కొలతలు వేశారు. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ షాపింగ్ కాంప్లెక్స్ రూంలు పడిపోవడానికి సిద్ధంగా ఉండడంతో ప్రభుత్వం స్పందించిందన్నారు. ప్రభుత్వం ఆదోని ఎస్సీ షాపింగ్‌లో ఉన్న రూముల మరమ్మతుల నిమిత్తం రూ.22 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు ఏఈ తెలిపారు. త్వరలోనే మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు.

## దేవనకొండలో బీసీ హాస్టల్, మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని వినతి

**దేవనకొండ, డిసెంబరు04, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన దేవనకొండలో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని తక్షణమే పున: ప్రారంభించాలని, మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాని ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ అన్నారు. గురువారం పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్‌ను ఏఐఎస్ఎఫ్ మండల ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ మాట్లాడుతూ నిత్యం దేవనకొండ మండలంలో కరువు కాటకాలతో ప్రజలు అల్లాడిపోతున్నారని, బతుకుదెరువు కోసం పట్టణాలకు వలసలు వెళ్తున్నారన్నారు. వారి వెంట పిల్లలను తీసుకెళ్లడంతో విద్యకు దూరమవుతున్నారన్నారు. వెంటనే హాస్టల్, మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తే ఇక్కడే విద్యార్థులు ఉండి చదువుకుంటారన్నారు. అలాగే దేవనకొండలో మూతబడిన డీఎస్టీ హాస్టల్‌ను పున: ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని, విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు హరి, అక్బర్, పురుషోత్తం, శీను, భాస్కర్ పాల్గొన్నారు.



## టిడిపి గ్రామ సర్పంచుకు ఘోర అవమానం..?





**ఆత్మకూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త:** వైసిపి ప్రభుత్వం లో టిడిపి పార్టీలో అత్యధిక మెజార్టీతో ప్రజలు గ్రామ అభివృద్ధి కోసం తమ నాయకుడిని ఎన్నుకొని ఐదు సంవత్సరాల పాలనలో టిడిపి గ్రామ సర్పంచులకు ఆ ప్రభుత్వం చిన్న చూపు చూసిన విషయం అందరికీ తెలిసిందే రాష్ట్రవ్యాప్తంగా టిడిపి పార్టీ అధికారంలోకి వచ్చాక గ్రామ సర్పంచులకు అభివృద్ధి పేరుతో పెద్దపీట వేసింది ఏ అభివృద్ధి జరగాలన్న ముందు గ్రామ సర్పంచ్ కీలకంగా ఉంటారు అధికారుల తప్పిదాలతో చివరకు టిడిపి పార్టీ గ్రామ సర్పంచ్ కు ప్రోటోకాల్ లో ఘోర అవమానం జరిగిందని చెప్పవచ్చు శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండల పరిధిలోని బాపనంతాపురం గ్రామంలో గురువారం డివిజనల్ అభివృద్ధి కార్యాలయాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించారు రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు. ఎంపీపీలు జడ్పిటిసిలు. తోపాటు శిలాఫలకంలో అందరి పేర్లు ఉన్నాయి అయితే ఈ శిలాఫలకంలో నా పేరు ఎందుకు వెయ్యలేదని బాపునంతపురం గ్రామ సర్పంచ్ గ్రంధి వేముల దరగయ్య అధికారులను ఘాటుగా ప్రశ్నించారు. ప్రోటోకాల్ పేరుతో చిన్న చూపు చూసిన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఏదిఏమైనాప్పటికీ గ్రామ సర్పంచుకు ప్రోటాకాలు పాటించకపోతే ఆ అధికారుల పరిపాలన ఎందుకు అని గ్రామ ప్రజలు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు

## విద్యార్థుల విద్యాప్రమాణాల పెంపు, పాఠశాల మౌలిక వసతులపై చర్చ



**అవుకు రూరల్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో నేడు జరిగే మెగా పేరెంట్స్ సమావేశంలో చర్చ ఉంటుందని అవుకు మండల టీడీపీ అధ్యక్షులు ఉగ్రసేనారెడ్డి పేర్కొన్నారు. పేరెంట్స్ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి హాజరవుతుండడంతో వేదిక ఏర్పాట్లను ఉగ్రసేనారెడ్డి స్వయంగా పరిశీలించారు. సమావేశం విజయవంతం కావడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాప్రమాణాలు పెంపు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై విద్యార్థినిల పట్ల పలు జాగ్రత్తలు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అరాతీయనున్నారు. ముఖ్యమైన కార్యక్రమంలో తల్లిదండ్రులు అందరు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల సమక్షంలోనే పాఠశాల అభివృద్ధికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకోబడతాయన్నారు.

## డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర సర్టిఫికెట్ కోర్సు




**బనగానపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:** పట్టణంలో ప్రభుత్వ డిగ్రీకళాశాల భౌతికశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక ఎలక్ట్రానిక్ భాగాలు అనే అంశంపై గురువారం సర్టిఫికెట్ కోర్సు ప్రాంరభించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎస్ లలిత అధ్యక్షత వహించారు. ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పకుండా ఒక సర్టిఫికెట్ కోర్సు చేయాలని ఆమె సూచించారు. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న టెక్నాలజి రంగంలో మనం భాగస్వామ్యం కావాలంటే విద్యార్థులందరు అన్నిసబ్జెక్టుల్లో అవగాహన ఏర్పరుచుకోవాలని ఆమె ఉద్ఘాటించారు. విద్యార్థులందరు విద్యసంబంధిత మరియు నైపుణ్య రంగాల్లో చురుగ్గా పాల్గొని కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థుల్లో ప్రేరన కలిగించారు. కో ఆర్డినేటర్, ఫిజిక్స్ లెక్చర్ ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కోర్సు నిర్వహణ మరియు అవశ్యకతను వివరించారు. ఈకోర్సు చేయడం వల్ల లాభాలు, భవిష్యత్తులో ఉన్నత చదువులకు ఈకోర్సు ఉపయోగంగ ఉంటుందన్నారు. నిత్యజీవితంలో ఎలక్ట్రానిక్ పరికరాలు ఒకభాగమని వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ విద్యార్థులు సర్టిఫికెట్ కోర్సు ఎంచుకోవడం వల్ల భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని తెలిపారు. వృక్షశాస్త్ర అధ్యాపకులురాలు మాట్లాడుతూ విద్యార్థులు నూతన విషయాలు నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులు మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. కంప్యూటర్ అప్లికేషన్ లెక్చర్ మాధవి, ఫిజికల్ డైరెక్టర ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కర్నూలు లో ఘంటసాల జయంతి వేడుకలు..



**కర్నూలు సిటీ, డిశంబరు 4 , ప్రభాతవార్త:** ఘంటసాల ఘనకళా సమితి ఆధ్వర్యంలో కర్నూలు లోని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఘంటసాల అభిమానులు, గాయకులు, సీనియర్ వైద్యులు ఈకార్యక్రమంలో పాల్గొని ఘంటసాల గొప్పతనాన్ని కొనియాడారు. ఘంటసాల పాటలు రోజు వింటే మనసు ప్రశాంతంగా ఉండి, అనారోగ్య సమస్యలు దూరమోతాయని వైద్యులుతెలిపారు. డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ ఘంటసాల కు భారతరత్న ఇవ్వాలని కోరారు. తెలుగు జాతి గర్వించదగ్గ మనిషి ఘంటసాల అని ఆయన కొనియాడారు. తెలుగు బాషతో పాటు కనడ, తమిళం, హిందీ పలు భాషల్లో పాటలు పాడిన ఘనత ఘంటసాల కే దక్కిందన్నారు. ఘంటసాల గాయకుడే కాక నటన, సంగీతం, దర్శకుడిగా గుర్తింపు పొందారన్నారు. ఘంటసాల చిన్న వయసులోనే మరణించడం భాదాకరమని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. ఘంటసాల గానకళా సమితి అధ్యక్షుడు వాసు, డాక్టర్. డబ్ల్యూ.సీతారాం, డాక్టర్. శంకర్ శర్మ, చంద్రశేఖర్ కల్కూర, డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, ఎలమర్తి, రమణయ్య,,రాఘవేంద్ర ప్రసాద్, పాల్గొన్నారు.

## పెద్దతుంబళం మండలం కోసం భారీ ఎత్తున రాస్తారోకో



**కర్నూలు సిటీ, డిశంబరు 4 , ప్రభాతవార్త:** పెద్దతుంబళం మండల హోదా కోసం జరుగుతున్న ప్రజా ఉద్యమం రోజు రోజుకు వేగం పెంచుకుంటూ గురువారం కొత్త దశలోకి ప్రవేశించింది. గ్రామమంతా స్వచ్ఛందంగా పూర్తి బంద్ పాటించడంతో, వ్యాపార సంస్థలు, బ్యాంకులు, పాఠశాలలు, షాపులు, హోటళ్లు అన్నీ స్వచ్ఛందంగా మూసుకొని రాస్తారోకో పాల్గొన్నారు. ప్రజలు, యువత, రాజకీయ పార్టీ నాయకులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, పాఠశాల విద్యార్థులు, రైతులు భారీగా పాల్గొనడంతో రాస్తా రోకో కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది. రోడ్డుబ్లాక్ కారణంగా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడి, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉద్యమం ఉధృతంగా సాగడంతో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పెద్దతుంబళం మండల హోదా కోసం జరుగుతున్న పోరాటం ఇక్కడితో ఆగదని, రాబోయే రోజుల్లో ఈ ఆందోళన మరింత ఉధృతం చేస్తామని పెద్ద తుంబలం సాధన కమిటీ మెంబర్స్ షేఖ్ హుస్సేన్, నజీర్ మంచాల, అజ్మతుల్లా, షేక్ అహ్మద్, రహమత్, షరీఫ్, నూర్ అహ్మద్, గాలి ఈరప్ప, శ్రీను, ఖాదర్, కేశవ, ఉచ్చప్ప, మొయిద్, సద్దాం తెలిపారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



**ఎమ్మిగనూరు రూరల్, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** పట్టణంలో వీవర్స్ కాలనీలో శ్రీ ఆంజనేయ స్వామి టెంపుల్ ప్రక్కన శ్రీ వెంకటేశ్వర కంటి వైద్యశాల లో మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత కంటి పరీక్షలు చూడబడనని డాక్టర్.నాగ వంశీకృష్ణ తెలిపారు. గురువారం డాక్టర్ నాగ వంశీకృష్ణ మాట్లాడుతూ మూడవ వార్షికోత్సవ సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కి అనూహ్య స్పందన వచ్చింది. దాదాపు రెండు వందలు మందికి కంటి పరీక్షలు చేయగా వారిలో యాభై మంది కి పైగా కంటిశుక్లం, ఇరువై మంది టీరీజియం ఉన్నట్లు గుర్తించారు. వీళ్లకు కంటిశుక్లం, టీరీజియం సమస్యలలో బాధపడుతున్న వారికి అత్యాధునిక పరికరాలతో అతి తక్కువ ధరలతో లేజర్ ఆపరేషన్లు చేస్తామన్నారు. సేవా దృక్పథంతో ప్రజలకు మరింత వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానని అన్నారు. హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చర్చి నిర్మాణానికి ఎమ్మార్పీఎస్ నాయకుడు విరాళం



**మంత్రాలయం, డిసెంబరు04, ప్రభాతవార్త;** మండల పరిధిలోని సూగూరు గ్రామానికి చెందిన జైభీం ఎమ్మార్పీఎస్ నాయకులు గర్జి హనుమన్న నూతన చర్చి నిర్మాణానికి గురువారం విరాళం అం దజేశారు. గొనెగండ్ల మండలం చిన్ననేలటూరు గ్రామంలో నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి రూ.10 వేలు నగదును నిర్మాణ చర్చి పెద్దలకు అందజేశారు. అనంతరం పెద్దలు హనుమన్నను పూలమాలలతో న్మానం చేశారు. ఆర్థిక సాయం చేసిన హనుమన్నకు పెద్దలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు హరీష్, పరశురామ్, మోషే, నరసింహులు, ప్రభుదాస్, వెంకటేష్, మాణిక్యం పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశానికి ప్రతిఒక్కరు హాజరుకావాలి

**రుద్రవరం, డిసెంబరు 4, ప్రభాతవార్త:** ఈనెల 6న మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసే మండల సర్వసభ్య సమావేశానికి అయా శాఖలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిఒక్కరు హాజరుకావాలని ఎంపీడివో భాగ్యలక్ష్మీ కోరారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 6న ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. మండలస్థాయి అధికారుల, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటిసిలు సకాలంలో హాజరయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## విడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, టీడీపీ నాయకులు

**కొలిమిగుండ్ల, డిసెంబరు 4, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలో గురువరం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విడియోకాన్ఫరెన్స్ నందు పంచాయితీరాజ్ మంత్రి పవన కళ్యాణ్, ఏపీ రాష్ట్రమంతటా అన్‌లైన్‌లో 77 డివిజనల్ అభివృద్ధి కార్యాలయాల ప్రారంభోత్సవంలో భాగంగా విడియో ముందు కూర్చొని అధికారులు, మండల టీడీపీ నాయకులు వీక్షించారు. ఈవిడియోకాన్ఫరెన్స్‌లో అడ్మినిస్ట్రేటివ్ అఫీసర్ ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు వివేకానందరెడ్డి, ఎంఈవో అబ్దుల్ కలాం, ఎంవి శివరామిరెడ్డి, గూడూరు నాగార్జున్‌రెడ్డి, డిష్ గోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయితీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అఖీల భారత పులుల అంచన కార్యక్రమం



**రుద్రవరం, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రుద్రవరం నల్లమల అడవుల్లో అఖీల భారత పులుల అంచనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రుద్రవరం రేంజ్ అధికారి ముర్తుజా వలి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అఖీల భారత పులుల అంచనా 2026లో భాగంగా నల్లమల అటవీప్రాంతంలో రుద్రవరం అటవీక్షేత్రం పరిధిలో సెప్టెంబరు 1 నుంచి పులుల గణన ప్రక్రియ మొదలైందన్నారు. ఇందులో ఫేస్–1లోని 8 రోజుల ప్రోటోకాల్‌లో భాగంగా మొదటి మూడురోజుల్లో ప్రతిబీట్ పరిధిలో రోజుకు 5 కిలోమీటర్ల చొప్పున మొత్తం 15 కిలోమీటర్లు కాలిబాటన నడుస్తు అటవీసిబ్బంది మాంసహార జంతువులు అయిన పులి, చిరుత, ఎలుగుబంటి, రేస్ కుక్క, అడవి పిల్లి వంటి వాటి యొక్క ప్రత్యక్ష అనవాళ్లు, పరోక్ష అనవాళ్లు అయినటువంటి పెంటికలు, పాదముద్రలు, చెట్లను గీకిన గుర్తులను సేకరించడం జరుగుతుదన్నారు. శాఖహార జంతువులను గుర్తించేందుకు ప్రతిబీట్ పరిధిలో మూడు రోజులు ఉదయమే 2 కిలోమీటర్లు ఒకేదిశగా కాలిబాటన నడుస్తు దుప్పి, అడవి పంది, కొండ గొర్రె, కణతి వంటి శాఖహార జంతువులను వాటి పెట్టికలను అటవీసిబ్బంది నమోదుచేసి అటవీప్రాంతం సహజ అవాసంను అంచనా వేయడానికి వృక్షసంపదను గడ్డీ రకాలను ఔషద మొక్కలను యాప్‌లో నమోదుచేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం రుద్రవరం రేంజ్‌లోని 14 బీట్స్ పరిధిలో 210 కిలోమీటర్ల దూరంను మాంసహార జంతువుల అంచనా కోసం అటవీసిబ్బంది కాలిబాటన నడవడం జరిగిందన్నారు. శాఖహారుల జంతువుల అంచన సమయంలో చివరిరోజు రాబందులు కొరకు సర్వేచేయడం జరిగిందన్నారు. ఈసారి 2026లో మెగా హెర్బిబోరు జాబితాలో అడవిదున్నను కొత్తగా చేర్చడం జరిగిందన్నారు. ఈయన వెంట అటవీసిబ్బంది ఉన్నారు.

## అధికారుల తీరులో మార్పురాదా...?



**బండిఆత్మకూరు, డిసెంబరు 4, ప్రభాతవార్త:** గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయడానికి ప్రతి సచివాలయంలో పారిశుద్ధ్య కార్మికులున్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన గ్రామ, మండల పంచాయితీ అధికారులపై ఉందని బండిఆత్మకూరు మండలంలోని చాల గ్రామాలు పారిశుద్ధ్య లోపంతో ప్రజలు సతమతమవుతున్న విషయాన్ని ఎన్నోసార్లు పత్రికల ద్వారా అధికారులకు తెలియజయడం జరుగుతుంది కానీ పత్రికల్లో వచ్చిన అధికారుల తీరులో మార్పు రాదా అంటూ అయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామంలోని ఓ కాలనీలో డ్రైనేజీ కాల్వలు నిండిపోయి రోడ్లపైకి ప్రవహించడంతో వాటి దుర్వాసన తట్టుకోలేక కాలనీవాసులే డ్రైనేజీ పూడీకతీత పనులు చేపట్టారు. గ్రామాల పరిశుభ్రతపై ప్రజల ఆరోగ్యభద్రతపై రాష్ట్ర ప్రభుత్వం మండలంలో, గ్రామంలో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఆ వ్యవస్థలో నిర్వర్యం కావడంతో ప్రజలు విసుగు చెంది పారిశుద్ధ్య పనులుచేసుకుంటున్నారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి గ్రామాల్లో ఉన్న సమస్యలపై చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

## అయ్యా మురుగును తొలగించండి



**రుద్రవరం, డిసెంబరు 4, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పెద్దమ్మ బయలు నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లె ప్రధాన రహదారి మధ్యలో ఉన్న మురుగును తొలగించాలంటూ అయ్యా ఈమురుగును తొలగించండి అని కాలనీవాసులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్లితే పెద్దమ్మ బయలు సమీపంలో రోడ్డు తగ్గుగా ఉండడంతో అటువర్షపునీరు ఇటు ఇళ్ళలోని నీరు, అటు కోళాయిల నీరు చేరి ఎటువెళ్ళలేని పరిస్థితి నెలకొందన్నారు. అలాగే నిత్యం ఈదారి వెంట ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఈదారి వెంట వెళ్తుంటారే తప్ప అటు కన్నెత్తి చూడరు. నిత్యం ఈదారిలో వాహనాల వెళ్ళె సమయంలో ఆ బురద చిట్టి తాము నివసించే ఇళ్ళల్లో బురదచిట్టడంత కాలనీవాసులు వాపోతున్నారు. మాపై దయవుంచి రోడ్డును ఎత్తుగాచేసి మమ్ములను రోగాల నుండి అటు బురద నుండి కాపాడాలని కోరుతున్నామన్నారు.

## హద్దులు పకడ్బందిగా గుర్తించాలి



**కొత్తపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:** అటవీశాఖ, రెవినూ్యశాఖకు సంబంధించిన భూములు పకడ్బందిగా గుర్తించాలని తహాశీల్దార్ ఉమా రాణి సూచించారు. ఆమె మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో జరుగుతున్న అటవీశాఖ, రెవిన్యూశాఖ సరిహద్దులో జరుగుతున్న రీ సర్వేను అటవీశాఖలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవిష్యత్తు తరాలకు ఇబ్బంది లేకుండా సర్వేచేయాలని హద్దులను పకడ్బందిగా గుర్తించాలని ఆమె రెవిన్యూ సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహాశీల్దార్ పెద్దన్న, ఫారెస్టుసెక్షన్ అఫీసర్ జ్యోతి స్వరూప్, విఆర్వో చంద్రశేఖర్ మరియు రెవిన్యూ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సిఐటియు అఖీల భారత మహాసభలను జయప్రదం చేయండి

**కొత్తపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు, ఉద్యోగులకు, ప్రజలకు వ్యతిరేకంగా చేపడుతున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం చేసుకునేందుకు విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం, మండల కార్యదర్శి కె దినేష్‌లు అన్నారు. వారు గురువారం మండలంలోని అఖీల భారత మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 12 సంవత్సరాల కాలంలో కార్మికులను బానిసలు చేసే విధానాలు అమలు చేస్తున్నారని, కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలు అవలంబిస్తున్నారని ప్రపంచ దేశాలు సైతం 8 గంటల పనివిధానాన్ని అమలుచేస్తుంటే మనదేశంలో 13 గంటల పనివిధానాన్ని అమలుచేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగసంస్థలైన బిఎస్ఎన్ఎల్, రైల్వే, రక్షణ, ఎల్ఐసి, పోస్టల్‌బ్యాంకు లాంటి సంస్థలను పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగించి ఉద్యోగులకు భద్రతలేకుండా చేస్తుందన్నారు. విశాఖపట్నంలో జరిగే లక్షలాది మంది కార్మికులు ఉద్యోగులు బారీ బహిరంగ సభ ప్రభుత్వానికి హెచ్చరిక పంపేలా కథం తొక్కుతామన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వాములు, రైతు సంఘం కార్యదర్శి దాసు, కెవిపిఎస్ జిల్లా నాయకులు సంపత్, ఆటో యూనియన్ నాయకులు శ్రీకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**మంత్రాలయం, డిసెంబరు04, ప్రభాతవార్త;** మండల పరిధిలోని సింగరాజనహళ్లి గ్రామంలో గురువారం సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన సీసీరోడ్డు నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. ముందుగా సర్పంచ్ ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. సుమారు రూ.6 లక్షల మండల పరిషత్ నిధులతో ఈ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. నూతన తాగునీటి కుళాయి, మోటార్ ఏర్పాటు చేశామన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ రామాంజినేయులు, పంచాయతీ కార్యదర్శి మధుశ్రీ, నాయకులు నరహరిరెడ్డి, లింగప్ప, తిక్కన్న, బసప్ప, హనుమంతురెడ్డి, డబ్బా నరసప్ప పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి సేవలు మరువలేనివి



**హొళగుంద, డిసెంబరు04, ప్రభాతవార్త;** హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీలో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బళ్లారి రాజశేఖర్‌గౌడ్‌కు గ్రేడ్–3 పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి పొందారు. బళ్లారి రాజశేఖర్‌గౌడ్‌కు ఎంపీడీఓ విజయలలిత, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, కె.నాగరాజు, రంగస్వామి, రాజ్‌కుమార్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శాలువా వేసి పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆయన మండలకేంద్రానికి గత ఏడు సంవత్సరాలుగా చేసిన సేవలను కొనియాడారు. తిరిగి ఇదే గ్రామానికి పంచాయతీ కార్యదర్శిగా తిరిగి విధులు నిర్వహించడానికి రావాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఇలాంటి పదోన్నతులు ఆయన జీవితంలో ఎన్నో పొందాలని, ఎదగాలని ఆకాంక్షించారు. బసవ, షేకావలి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి, మత్తు పదార్థాలను అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**కర్నూలు డిసెంబర్ 4 ప్రభాతవార్త ప్రతినిధి :** యువతను మత్తు పదార్థాలకు బానిసలు చేస్తూ వారి భవిష్యత్తును నిర్వీర్యం చేస్తూ సమాజంలో జరిగే అనేక రుగ్మతలకు కారణమవుతున్న గంజాయి మత్తు పదార్థాలను విక్రయించే వారిపై, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈ శ్రీరాములు, కె శ్రీనివాసులు డిమాండ్ చేశారు గురువారం నాడు స్థానిక సిఆర్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీరాములు, శ్రీనివాసులు మాట్లాడుతూ 2024 ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వ హయంలో గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలు విచ్చలవిడిగా రవాణా జరుగుతా ఉన్నాయని, దీనివల్ల రాష్ట్రంలో అనేక అరాచకాలు జరుగుతున్నాయని ఆరోపించిన కూటమి నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 100 రోజుల్లో గంజాయి, డ్రగ్స్, కొకైన్ లాంటి మత్తు పదార్థాలను కూకటివేలతో పెకలిస్తామని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రగల్భాల్ పలికి అధికారం చేపట్టి 18 నెలలు




గడుస్తా ఉన్న ఇప్పటివరకు మత్తు పదార్థాలు నిషేధానికి కట్టుదిట్టమైన చర్యలు మరింతగా గంజాయి పెరుగుతుందని మరి కూటమి నాయకులు ఏం చేస్తున్నారని వారు ప్రశ్నించారు నెల్లూరు జిల్లాలో గంజాయి మాఫియా ఆగడాలను వ్యతిరేకిస్తున్నారని పెంచలయ్య అనే కళాకారుని చంపేయడం చూస్తా గంజాయి బ్యాచి ప్రభుత్వాన్ని కూడా లెక్కచేయడం లేదని విషయం అర్థం అవుతుందని వారు పేర్కొన్నారు గంజాయి విక్రయించేవారు ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే వారి పక్షాన చేరి విచ్చలవిడిగా గంజాయి విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని అవునా రాష్ట్ర ముఖ్యమంత్రి గారు హోం శాఖ మంత్రి గారు స్పందించాలని వారు డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం అడవులకు రక్షణగా ఉండిఅడవి సంపదను కాపాడుతున్న మావో యిస్టులను డెడ్లైన్ పెట్టి డ్రోన్ల ద్వారా ప్రహార కాచి వారిని చంపుతా ఉంటే వారికి వత్తాసు పలికే రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలో, దేశంలో ఎక్కడ గంజాయి పండుతావుంది ఎక్కడ సరఫరా అయితా ఉందని ఎందుకు నిఘా పెట్టలేకపోతున్నారని వారు మండిపడ్డారు, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వారి నిర్లక్ష్యాన్ని యువత ప్రశ్నించకుండా ఉండేందుకు యువతను మత్తులో మత్తు పదార్థాల రవాలను చూసి చూడనట్టు వదిలేసిందనే ఆరోపణలు వస్తున్నాయని వారి విమర్శించారు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ చిన్న మీటింగ్ జరిగిన క్షణాల్లో ఇంటెలిజెన్స్ రిపోర్ట్ ద్వారా తెలుసుకొని వారిని ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చేయకుండా నివారించే పోలీసు వ్యవస్థ ఉన్న రాష్ట్రంలో గంజాయి సప్లై చేసే వారిని ఎందుకు అరికట్ట లేకపోతున్నారని వారు విమర్శించారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడి గంజాయి డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు సప్లై చేసే వారి పైన కఠిన చర్యలు లేనిపక్షంలో ఏఐవైఎఫ్ గా విద్యార్థులను యువకులను చైతన్యం చేసి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు బిసన్న, నగర నాయకులు చంటి, శివ, అఖిల్ దస్తగిరి, పాల్గొన్నారు.

# అన్ని ప్రభుత్వ స్కూళ్లలో మెగా పేరెంట్స్ సమావేశం



**కర్నూలు అర్బన్, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** కల్లూరు మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల యందు మెగా పేరెంట్ మీటింగ్ ఏర్పాటు చేశామని కల్లూరు మండలం ఎంఈఓ ఎం. శ్రీనివాసులు తెలిపారు. వారు మాట్లాడుతూ మెగా పేరెంట్ మీటింగ్ కు కల్లూరు మండలంలో గల అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులకు మీ పిల్లల యొక్క భవిష్యత్తు కొరకు మరియు వారిని ఎలా తీర్చిదిద్దాలో చర్చించుటకు కావలసిన ఏర్పాట్లు ప్రభుత్వం కల్పిస్తుంది. ఉదయం గం.9.00 గంటల నుండి మధ్యాహ్నం గం.1.00. ల వరకు మీటింగ్ నిర్వహించబడును. కావున తల్లిదండ్రులు, మేధావులు, పూర్వ విద్యార్థులు, సర్పంచులు, జడ్పిటిసి, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, విద్యా కమిటీ సభ్యులు, దాతలు పాల్గొనగలరు. పాల్గొని ఉపాధ్యాయులతో మీ పిల్లల యొక్క విద్య ఎలా ఉందో విశ్లేషించుకొని వారి యొక్క భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవలసిందిగా కోరుతున్నాం. అంతేకాకుండా ఉపాధ్యాయుల కు సలహాలు సూచనలు ఇవ్వ వలసిందిగా కోరడమైనదనీ తెలిపారు.

# కేఎంసి ఫుట్బాల్ టీం కు రన్నర్ అప్ కప్పు



**కర్నూల్ హాస్పిటల్, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రాష్ట్ర స్థాయి పోటీల్లో కేఎంసి ఫుట్ బాల్ టీమ్ కు రన్నర్స్ అప్.. అభినందనలు తెలిపిన ఎ.డి.ఎం.ఇ కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ.. డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ అఫ్ హెల్త్ సైన్సెస్ వారు నిర్వహించిన 27వ మెడికల్ మరియు డెంటల్ అంతర్ కళాశాల ఆటల పోటీలలో ఫుట్ బాల్ యందు కర్నూల్ మెడికల్ కాలేజ్ చెందిన వైద్య విద్యార్థుల ఫుట్ బాల్ టీం ఫైనల్ కు చేరుకొని ఫైనల్ పోటీల్లో రన్నర్స్ గా నిలిచి రెండవ స్థానం సాధించడం జరిగింది. కేఎంసీ వైద్య విద్యార్థులు వైద్య విద్యతో పాటు ఆటల పోటీల్లో కూడా రాణిస్తుండడం పట్ల ప్రిన్సిపల్ సంతోషాన్ని తెలియచేస్తూ పోటీలో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. అందుకు కృషిచేసిన ఫిజికల్ డైరెక్టర్స్ ను, స్పోర్ట్స్ కమిటీ కు అభినందనలు తెలిపారు.. ఈ అంతరాష్ట్ర మెడికల్ కళాశాలల పోటీలు జి.ఎస్.ఎల్ మెడికల్ కాలేజీ రాజమండ్రి నందు 29112025నుండి 30112025 వరకు జరిగాయి. ఇందులో ఫుట్బాల్ నందు 22 కాలేజీలు వాలీబాల్ నందు 32 కాలేజీలు చెస్ నందు 23కాలేజీలు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీల్లో విన్నర్స్ప్‌గా రాజమండ్రి కాలేజి టీం గా నిలువగా కర్నూల్ వైద్యాకళాశాల విద్యార్థులు రన్నర్స్ప్‌గా నిలిచారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల టీం సహకరించిన సిబ్బంది ప్రిన్సిపల్ ను కలవడం జరిగింది. కాలేజి స్పోర్ట్స్ కమిటీ వైస్ చైర్మన్ .విద్యా సాగర్, మెడిసిన్ హెచ్ ఓ డి .శ్రీరాములు, సభ్యులు. విజయశంకర్. . సోమశేఖర్, . విజయ్ బాబు, ప్రవీణ మరియు ఫిజికల్ డైరెక్టర్ రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ, పోలీస్ ఉద్యోగం పొందిన కురువ కులస్థులకు సన్మానం..



**కర్నూలు, డిసెంబర్ 04, ప్రభాతవార్త ప్రతినిధి :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో గొర్రెల కాపరులుగా జీవనం సాగిస్తున్న కురువ కులస్థులు 2025 సంవత్సరంలో మెగా డీస్సీ లో ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులు మరియు పోలీస్ కానిస్టేబుళ్లగా ఉద్యోగం పొందిన కురువ కులస్థులు అందరూ కూడా తమ పేర్లు, ఉద్యోగం, చిరునామా, ఫోన్ నెంబర్ తో సహా పూర్తి వివరాలు తేదీ :1012 2025 లోగ కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎం. కె. రంగస్వామి ఫోన్ నెంబర్:9032741194 కి వివరాలు వాట్సాప్ ద్వారా తెలుపగలరని జిల్లా కురువ సంఘం అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు జిల్లా కార్యవర్గ సమావేశం లో కోరారు. త్వరలో అందరికీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో సన్మానించవదలిచినామని ఆయన తెలిపారు. కురువ కులస్థులు అందరూ ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉన్న వారు తప్ప కుండా గ్రామంలో, మండలంలో, జిల్లాలో ఉన్న కురువ సంఘం నాయకులతో అన్ని విషయాలు చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశం లో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కె. రంగస్వామి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న జిల్లా ఉపాధ్యక్షులు బి. వెంకటేశ్వర్లు, పెద్దపాడు ధనుంజయ, టి. ఉరుకుంద, కత్తి శంకర్ నగర కురువ సంఘం అధ్యక్షులు తవుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి బి. రామకృష్ణ, జిల్లా నాయకులు పాలసుంకన్న, బి. సి. తిరుపాల్, పెద్దపాడు పుల్లన్న,కొత్తపల్లి దేవేంద్ర, కె. వెంకటేశ్వర్లు, దివాకర్, కొండన్న, మద్దిలేటి పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభవంతులకు అందరు చేయూత అందించాలి



**క్రిష్ణగిరి, డిసెంబర్4, ప్రభాతవార్త :** మన సమాజంలో విభిన్నప్రతిభవంతులకు అందరు చేయూత అందించాలని ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ రాజేశు, పత్తికొండ మార్కెట్ యార్డుచైర్మన్ యస్.కె నబిసాహెబ్, మండల టి.డి.పి అధ్యక్షుడు దామోదర్‌నాయుడు, సీనియర్ టి.డి.పి నాయకులు మర్రిశ్రీరాములు అన్నారు. గురువారం రోజు మండలకేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. వక్తలు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు వీరికి సహ కరించాలన్నారు. ప్రభుత్వం వారికి ఫించన్లు అందజేయడమే కాక ప్రతిభ కనపరిచిన వారికి చేయూత అందిస్తుందన్నారు. వారి ఎదుగుదలకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి మాదపురం గురుస్వామి, మండల తెలుగుయువత అధ్యక్షులు బొంతిరాళ్ల రఫిసాహెబ్ పాల్గొన్నారు.

# త్రోబాల్ పోటీల్లో జెడ్పీ పాఠశాల విద్యార్థులు విజయం

**– విద్యార్థులు క్రీడల్లో రాణించడం గర్వకారణం – హెచ్‌ఎం రంగన్న**



**ఆదోనిలీగల్, డిసెంబరు04, ప్రభాతవార్త;** ఆదోనిలోని ఆర్ఆర్ లేబర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన త్రోబాల్ పోటీల్లో మదిరె-111 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టు మొదటి స్థానం సాధించింది. పాఠశాల హెచ్ఎం రంగన్న, ఉపాధ్యాయులు విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యారు ్థలకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నట్ల తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించడం సంతోషంగా ఉందన్నారు. మున్ముందు కూడా జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

# కార్మికుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలపై ఉద్యమిద్దాం




**ఆదోనిటౌన్, డిసెంబరు04, ప్రభాతవార్త;** కార్మికుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలపై ఉద్యమిద్దామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మునెప్ప, జిల్లా అధ్యక్షులు అజయ్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఓబీ నాగరాజు అన్నారు. గురువారం ఆదోని పట్టణంలోని కార్యాలయంలో ఏఐటీయూసీ ఆదోని పట్టణ సమితి బాడీ సమావేశాన్ని పట్టణంలో ఉన్న అనుబంధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశం పట్టణాధ్యక్షులు వై.టి.భీమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే బ్రిటీష్ పాలకుల మెడలు వంచి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను సంపన్న వర్గాలు, అదానీ, అంబానీలాంటి పెట్టుబడిదారులకు అనుకూలం చేశారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇస్తామని కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి ఆ స్థానంలో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని నమ్మించి అధికారంలోకి ప్రభుత్వం వచ్చిందన్నారు. హక్కుల సాధనకై ప్రభుత్వాలపై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వీరేష్, హుసేని, షేకా ్వలి, రంగస్వామి, లక్ష్మన్న, భీమన్న, జయరాజ్, గుండన్న, నరసింహులు పాల్గొన్నారు.

# బాధితా కుటుంబానికి సాయం అందించిన జనసైనికులు



**దేవనకొండ, డిసెంబరు04, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన దేవనకొండ గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు హరిజనవాడకు చెందిన పి.అంజలి గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై మృతిచెందారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నాయకులు గురువారం బాధితా కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహం పై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధితా కుటుంబ సభ్యులకు రూ.5 వేలు నగదు ఆర్థిక సాయం అందించారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ఆలూరు మార్కెట్‌యార్డు డైరెక్టర్ బోయ సరోజమ్మ, జనసేన నాయులు కటిక ఉచ్చీరప్ప, భూసల రామాంజినేయులు, బొద్దు నాగరాజు, బంగి బాలు, పరమేష్, రమేష్, సతీష్, ఖలీల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# శనగ పంటపై అవగాహన కార్యక్రమం



**కర్నూలు అర్బన్, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో కల్లూరు మండలములోని లక్ష్మీపురం, తడకనపల్లె గ్రామంలో శనగ పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కల్లూరు మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నూతన రకాలు, శనగ పంటపై ప్రయోజనాలు, సాగు విధానాలు, పురుగు మందుల వినియోగం వంటి అంశాలపై రైతులకు వివరించారు. అంతర పంటలు, నూతన రకాలపైనా రైతులు అవగాహన పెంపొందించుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఇ.ఓ. సువర్ణ, ఎంపీఓ లు రైతులు పాల్గొన్నారు.

# హుండీ ఎత్తుకెళ్లిన దొంగ అరెస్ట్

**– వివరాలు వెల్లడించిన ఎస్ఐ నాగార్జునరెడ్డి**



**గడివేముల, డిసెంబరు 4, ప్రభాతవార్త;** మండలంలోని కొత్త పెద్దమ్మ దేవాలయంలో 09-09-2025వ తేదీని తెల్లవారుజామున ఆలయంలో హుండీ ఎత్తుకెళ్లిన దొంగను పట్టుకున్నట్లు గడివేముల ఎస్ఐ సి.సి.నాగార్జున రెడ్డి తెలిపారు. గురువారం దొంగను మీడియా ముందు చూపుతూ ఎస్ఐ వివరాలు వెల్లడించారు. హుండీ చోరీ కేసులో గువ్వల సాయిరాం అనే వ్యక్తిది ప్రకాశం జిల్లా అర్థవీడు మండలం బోయిపల్లె గ్రామమని తెలిపారు. మంచాల కట్ట గ్రామానికి వెళ్లే రహదారిలో పక్కా సమాచారం మేరకు పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. సదరు వ్యక్తి వద్ద నుంచి రూ.48,257 నగదు, పెద్దమ్మ అమ్మవారి 520 గ్రాముల సిల్వర్ ఆభరణాలు, ఒక మొబైల్ ఫోన్, ఏపీ39వీడీ 6308 నంబర్ గల బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గువ్వల సాయిరాంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. దొంగను పట్టుకుని కేసును చేధించినందుకు జిల్లా ఎస్పీ సునీల్‌షెరాన్, నంద్యాల ఏఎస్పీ మందా జావళి అల్ఫోన్సాలు పోలీసులను అభినందించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాల కట్టడికి గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రతి దేవాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# తహసీల్దార్ కార్యాలయం ముందే గుడిసె వేసి నిరసన



**ఎమ్మిగనూరు రూరల్, డిసెంబర్ 4, ప్రభాతవార్త:** సామాజిక వెలివేతకు గురై, నిలువ నీడలేక ఇబ్బంది పడుతున్న ఓ దళిత మహిళకు న్యాయం చేయాలంటూ సమతా సైనిక దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సి రంగయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు గుడిసె వేసి నిరసన తెలిపారు. గురువారం సమతా సైనిక దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రంగయ్య మాట్లాడుతూ మంత్రాలయం మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మ కుమారుడు వేరే కులానికి చెందిన మహిళను వివాహం చేసుకోవడంతో గ్రామంలో ఘర్షణలు తలెత్తాయి. శాంతిభద్రతల సమస్యల దృష్ట్యా రెవెన్యూ, పోలీస్ అధికారులు ఆమెను గ్రామానికి వెళ్ళకుండా ఆదేశించారు. గ్రామానికి వెళ్లలేని పరిస్థితిలో ఉన్న తనకు నివసించేందుకు ప్రత్యామ్నాయంగా స్థలం చూపించాలని గోవిందమ్మ అధికారుల చుట్టూ తిరగడంతో, స్పందించిన జిల్లా కలెక్టర్ ఆమెకు ఎమ్మిగనూరులో నివాస స్థలం మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా కలెక్టర్ ఆదేశించి న తహసీల్దార్ స్థలం కేటాయింపులో జాప్యం చేయడంతో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోనే గుడిసె వేసి నివసించేందుకు సిద్ధమవడంతో గందరగోళం నెలకొంది. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. తహసీల్దార్ శేషఫణి ఆందోళనకారులతో మాట్లాడి, గోవిందమ్మకు వారం రోజుల్లోగా నివాస స్థలం కేటాయిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో బాధితులు తమ ఆందోళనను విరమించారు. సమతా సైనిక్ దళ్ రాయలసీమ నాయకులు పరమేష్ గోవిందు వెంకటేష్ రంగస్వామి నవ్యంధ్ర ఎం ఆర్ పి ఎస్ చార్లెస్, బతుకమ్మ పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలి




**హాలహర్వి, డిసెంబరు04, ప్రభాతవార్త;** విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని జీసీడీఓ మేరి స్నేహలత ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం మండలకేంద్రమైన హాలహర్విలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఆమె పరిశీలించారు. పాఠశాలలో విద్యా బోధన, భోజన వసతుల గురించి విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ విద్యార్థినీలకు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, మంచి విద్యాబోధన చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విద్యార్థినీలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే విద్యార్థినీలకు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పాఠశాలలో వాచ్‌మెనన విషయంలో ప్రిన్సిపాల్‌పై టీడీపీ నాయకులు దౌర్జన్యం చేసి దాడికి పాల్పడ్డారన్న విషయంపై జీసీడీఓను విలేకరులు అడుగగా... ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈమె వెంట ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

# డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహంపై పేడ చల్లి అవమానించిన వారిని శిక్షించాలి





**హొళగుంద, డిసెంబరు04, ప్రభాతవార్త;** భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్‌కు విగ్రహంపై పేడను వేసి అవమానించిన దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని ఎల్లార్తి గ్రామంలోని బస్టాండులో ఉన్న డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహంపై పేడ వేసి అవమానించిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. అనంతరం ఎల్లార్తి గ్రామంలో వెలిసిన శ్రీ షేక్షావలి, షాషావలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. దర్గా నిర్వాహకులు షాపీర్‌ఖాన్ వారికి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు జరిపించారు. సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, టీడీపీ ప్రధాన కార్యదర్శి గోవింద్‌గౌడ్, ఆలూరు మార్కెట్‌యార్డు డైరెక్టర్ నభిరసూల్, మైనార్టీ నాయకులు సిబిఎన్ ఆర్మీ మోదీన్, మహబూబ్‌బాషా, ఎల్లార్తి గ్రామ టీడీపీ నాయకులు మల్లికార్జున, దళిత సంఘాల నాయకులు చిదానంద, హనుమంతు, నాగేంద్ర, భాస్కర్‌లు పాల్గొన్నారు.

# కార్యకర్తను కోల్పోవడం బాధాకరం



**కౌతాళంరూరల్, డిసెంబరు04, ప్రభాతవార్త;** మండలంలోని కుంటనహాల్ గ్రామానికి చెందిన టీడీపీ యువ కార్యకర్త వేమన్న మృతి బాధాకరమని టీడీపీ యువ నాయకులు రాకేష్‌రెడ్డి, యువ నాయకులు సతీష్‌నాయుడు, మండలాధ్యక్షులు సురేష్‌నాయుడు అన్నారు. గ్రామ యువ మ్యు కార్యకర్త వేమన్న అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వారు బాధితా కుటుంబాన్ని పరామర్శించారు. వేమన్న మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధితా కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. వేమన్న పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని, వేమన్న మృతి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో సింగిల్‌విండో చైర్మన్ బోయ మారెప్ప, గ్రామ నాయకులు మాణిక్‌బాషా, హాజీ, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# మెగా పేరెంట్స్ సమావేశానికి ఆహ్వానం



**కౌతాళంరూరల్, డిసెంబరు04, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన కౌతాళంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు గురువారం టీడీపీ యువ నాయకులు, మండలాధ్యక్షులు సురేష్‌నాయుడికి కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ కార్యక్రమంలో పాల్గొనాలని గురువారం ఆహ్వానం అందించారు. ఇందులో భాగంగా విద్యార్థుల పట్ల ఉన్న ఆసక్తి, తల్లిదండ్రులకు వివరించి, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి గురించి తల్లిదండ్రులకు తెలియజేసే విధంగా పేరెంట్స్ 3.0 సమావేశానికి అందరూ రావాలని పిలుపునిచ్చారు.

# చట్టాల అమలులో అందరికి సమన్యాయం



**వెల్దుర్తి, డిసెంబర్4, ప్రభాతవార్త :** చట్టాల అమలులో అందరికి సమన్యాయం చేయడమే జనసేన పార్టీ లక్ష్యమని జనసేనపార్టీ జిల్లా కమిటీ కోఆర్డినేషన్ మెంబర్ నాయకల్లు బాబ్జి అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలో గురువారం మండలంలోని జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఆ పార్టీ జిల్లా నాయకులు బాబ్జి మాట్లాడుతూ బ్లాక్ మార్కెట్ వ్యవహారాల నిర్మూలన, వి ద్య వైద్యం మెరుగుపరచడం, ప్రజాధనం వ్యయానికి కాపలా, జాతీయ సమైక్యతా వంటి లక్ష్యాలతో తమ పార్టీ ముందుకు వెళ్తుందన్నారు. జనసేనపార్టీ అధినేత, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ జిల్లా కమిటీ కోఆర్డినేషన్ మెంబర్ నాయకల్లు బాబ్జి, నాయకులు, కార్యకర్తలు వెల్దుర్తి జాకీర్, దివాన్‌వలి, శ్రీనివాసులు, పుల్లగుమ్మి పరమేష్, రత్నపల్లి రమణ, కలుగోట్ల ఆది, గోవర్ధనగిరి రవి, సూదేపల్లి చిన్నస్వామి, మల్లెపల్లిరాముడు, రామళ్లకోట బాలు, చంద్రశేఖర్, యాదరాళ్ల మహేంద్ర, మదార్‌పురం ఫకృద్దీన్ పాల్గొన్నారు.

# రమణీయం మార్లబండ ఆంజినేయ స్వామి రథోత్సవం..

**– స్వామిని దర్శించుకున్న పలువురు నాయకులు..**



**సజ్జలగుడ్డం (కోసిగి), డిసెంబరు 4, ప్రభాతవార్త :** సజ్జలగుడ్డంతో పాటు పక్క గ్రామాలకు ఇలవేల్పు అయిన మార్లబండ ఆంజినేయ స్వామి రథోత్సవం గురువారం సాయంత్రం అత్యంత వైభవంగా, రమణీయంగా, కన్నుల పండువగా జరిగింది. సాయంసంధ్య వేళ దినకరుడు కొండల్లో కనుమరుగవుతుండగా ఆంజినేయస్వామి నామ స్మరణతో గ్రామ పొలిమేర పొలాలన్నీ మారుమ్రోగాయి.. ముందుగా సంప్రదాయం ప్రకారం దేవాలయపు మేటీలైన మాజీ సర్పంచ్ విశ్వనాథరెడ్డి, ఇరుపన్నగారి మల్లికార్జున, ఇంటి నుండి పూర్ణకుంభం మేళతాళాలతో రాగా అర్చకులు ఆ కుంభాన్ని స్వీకరించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో ప్రజలు మార్ల బండ ఆంజినేయ స్వామి వారి రథాన్ని ముందుకు లాగారు. వచ్చిన భక్తులు జయ జయ ధ్వనులు పలుకుచుండగా ఆనందోత్సవాల మధ్య భక్తులు అరటి పళ్లను రథంపైకి విసురుతూ 50 మీటర్ల వరకు రథంను లాగి తిరిగి యధాస్థానంలో రథాన్ని ఉంచారు. సజ్జలగుడ్డం సర్పంచ్ జెకే.నరసమ్మ, రాజకీయ నాయకులు సజ్జలగుడ్డం గ్రామ నాయకులు ముక్కరయ్య, హనుమంతరెడ్డి, కురువ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు. రథోత్సవంలో సిఐ మంజునాథ్ నేతృత్వంలో ఎస్ఐలు రమేష్‌రెడ్డి, పిఎస్ఐ ఈశ్వరయ్యల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును నిర్వహించారు..



# పాముకాటుతో విద్యార్థి మృతి



**మంత్రాలయం, డిసెంబరు04, ప్రభాతవార్త;** నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో పాముకాటుతో ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటనతో విద్యార్థి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. వివరాల మేరకు.. మంత్రాలయం పట్టణానికి చెందిన కట్టుబడి మౌలా, రహింబీ దంపతుల కుమారుడు కట్టుబడి మహమ్మద్(08) సంత మార్కెట్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నాడు. యదావిధిగా బుధవారం రాత్రి తమ ఇంటిలో నిద్రించారు. ఉదయం అందరూ లేచి గమనించేలోపు విద్యార్థి పాముకాటుతో మృతిచెందినట్లు తెలుసుకున్నారు. తమ కుమారుడు పాముకాటుతో మృతిచెందడంతో విద్యార్థి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# పేదోళ్ల మోములో చిరునవ్వు తెప్పిస్తున్న పారిశ్రామిక వేత్త గోళ్ల రాజేష్



**నంద్యాల, డిశంబరు 4, ప్రభాతవార్తప్రతినిధి :** నంద్యాల నియోజక వరగంలో ఎంతో మంది నాయకులు బడా బడా నేతలు దనవంతులున్నారు కాని నేటి వరకు ఎవ్వరు ఎలాంటి లాబాపేక్ష లేకుండా వారికి సహాయం చేయ్యలేదు కాని అలాంటి వారికి నేనున్నానంటు గోళ్ల రాజేష్ ముందుకు వచ్చారు. నేటి కాలంలో మనము తినే అహారము అంతా విషముతో కూడినదే అలాంటి అహారము తినడము వల్ల చిన్న వయస్సులోనే షుగరు బిపి, గుండె జబ్బులు, టిబి, క్యాసర్ లాంటి వ్యాదులు ప్రభలి ఖరీదైన మందులు కొనుగోలు చేయ్యలేక అర్ధాంతరముగా మృత్యువు వాతన పడుతున్నారు, అలాంటి దీర్ఘకాలిక వ్యాదులకు నెల నెల మందులు కొనుగోలు తాను అర్థిక సహాయం చేస్తానంటు ముందుకు వచ్చారు గోళ్ల రాజేష్ వివరాలోకి వెల్లితే నంద్యాలకు చెందిన నంద్యాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త ఇటీవల మొంథాతుఫాన్‌లో పంటలు దెబ్బతిన్న 132మంది రైతులకు ఒక్కోక్కరికి రూ 3000 వంతును 3లక్షల 30 వేలు అందించడము జరిగింది. గత నెలలో గోళ్ల రాజేష్ అనే వ్యక్తి పేదోళ్ల అరోగ్యము కోసం తన సొంత డబ్బులు వెచ్చించడానికి ముందుకు వచ్చి కదు దరిద్రము అనుభవిస్తున్న వారినిఎంపిక చేసి వారికి నెలకుమందులు కొనుగోలు రూ 2000 నగదును అందిస్తున్నారు. గతనెలలో మొదటి విడతగా దీర్ఘ కాలిక వ్యాదులతో బాదపడుతున్న వారిక రూ 20000 నగదను మందులకు అందిచేశారు. అలాగే బుదవారము కూడా రెండవ విడతగా 100మందికి రూ 2,30లక్షలు అందించి పేదోళ్ల మోములో చిరునవ్వు తెప్పించిన ఘనత అయనదే ఇలా పేదోళ్లకు మోములో ఎలాంటి లాబాపేక్ష లేకుండా వారికి అదుకుంటున్న గోళ్ల రాజేష్ త్వరలోఅయన పుట్టిన రోజును పురస్కరించకుని ఉన్నత చదువుల చదవి ఇంటి వద్ద అగమ్యగోచరముగా ఉంటున్న వారి కోసం నిరుద్యోగభృతి కింది రూ నగదును అందించి వారితో అత్మసైర్యనింపనున్నారు.



# ఉల్లి రైతులకు న్యాయం ఎప్పుడు..

**– కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వైసీపీ మాజీ ఇరిగేషన్ డైరెక్టర్ రేలంపాడు వెంకటేశ్వర్లు**



**మద్దికెర, డిసెంబరు04, ప్రభాతవార్త;** ఉల్లి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని, ఉల్లి రైతులకు న్యాయం ఎప్పుడు జరుగుతుందని వైసీపీ మాజీ ఇరిగేషన్ డైరెక్టర్ రేలంపాడు వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. ఆయన గురువారం ఉల్లి పంట వేసిన రైతులతో మాట్లాడారు. సమగ్ర సమాచారం సేకరించారు. నెలలు గడుస్తున్నప్పటికీ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడం విఫలమ య్యిందన్నారు. అబద్ధాల హామీలతో ప్రభుత్వం చేపట్టిన కూటమిప్రవభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేదన్నారు. అనేకమంది రైతులకు అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. స్థా నిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ పార్టీ సత్తా ఏమిటో కూటమి ప్రభుత్వానికి తెలుస్తుందన్నారు.

# అయ్యప్ప స్వాములకు విరాళం



**ఆదోని, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** ఆదోని పట్టణంలోని ఎస్.కె.డి కాలనీలో గల అయ్యప్ప స్వామి మండల పూజ సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భాగంగా, ఈ సంవత్సరం కూడా అయ్యప్ప భక్తుల సేవార్థం శుక్రవారం మధ్యాహ్నం జరగనున్న అన్నదాన కార్యక్రమానికి రూ.75,000/లను తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మారుతి నాయుడు విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ అన్నదాన కార్యక్రమాన్ని గత 8 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఆయన మేనమామ, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు చేతుల మీదుగా ప్రత్యేకంగా నిర్వహించుచున్నారు. అయ్యప్ప స్వామి భక్తులకు సేవ చేయడం తమ కుటుంబ సంప్రదాయంగా భావిస్తున్నామన్నారు..

# డోన్ బాబా గుడిలో.. మంత్రి బిసి

- దత్త జయంతి సందర్భంగా విశిష్ట పూజలు
- ఆలయ అర్చకుల సాంప్రదాయ స్వాగతం
- నేతలు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరు

**డోన్, నవంబర్ 4, ప్రభాతవార్త :** శ్రీ దత్తాత్రేయ స్వామి జయంతిని పురస్కరించుకుని గురువారం డోన్ పట్టణంలోని శ్రీశ్రీశ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో విశేష అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దఎత్తున చేరుకుని పూజల్లో పాల్గొని దేవాలయ ప్రాంగణాన్ని కైంకర్యస్ఫూర్తితో నింపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్వామివారిని దర్శించుకునీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రిని పూర్ణకుంభంతో సాంప్రదాయ పద్ధతిలో స్వాగతించి దత్తాత్రేయ స్వామికి అభిషేకం, మహామంగళహారతి నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పుష్పాలతో జరిగిన అభిషేకం భక్తులకు ఆధ్యాత్మికంగా ఆకట్టుకుంది. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు స్వామివారి దివ్యకటాక్షం అందాలని కోరుకున్నారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి బాబా గుడికి వచ్చిన సందర్భంగా రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సాయిబాబా మందిరం కమిటీ సభ్యుడు కందుకూరి పార్థసారథి, శ్రీరాములు, అలా మల్లికార్జున రెడ్డి, కొండా సురేష్, సీఎం శ్రీనివాసులు , యాపదిన్ సర్పంచ్ రామిరెడ్డి, బెస్త కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ప్రజా వైద్యశాల మల్లికార్జున, కుమ్మరి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గార్లదిన్నె సుధాకర్, టిడిపి నాయకుడు ప్యాపిలి రామసుబ్బయ్య, తెలుగు యువత నాయకుడు టీ.ఈ.చక్రపాణి గౌడ్ తదితరులు పూల బొకేలతో పూలమాలలతో దృశ్యాలవాలతో సత్కరిస్తూ మంత్రి బీసీని ఘనంగా



స్వాగతించారు. దేవాలయం అభివృద్ధి, భక్తులకు అందించే సేవల పురోగతిపై మంత్రి నిర్వాహకులతో పరామర్శించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్వామివారిని దర్శించి ప్రాంత ప్రజల శాంతి, సౌభాగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రి రాక సందర్భంగా డిఎస్పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిఐలు ఇంతియాజ్ , రాకేష్ తదితర ఎస్ఐలు సిబ్బంది ముందు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాటు చేయగ కార్యక్రమంలో ఆర్డిఓ తదితర ఆధికారులు పాల్గొన్నారు

# రూఫ్‌టాప్ సోలార్‌పై జీఎస్టీ తగ్గింపు

**: పిఎం సూర్య ఘర్ పై అవగాహన కల్పించాలి**

**కర్నూలు, డిసెంబర్ 04, ప్రభాతవార్త :** పిఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతం వరకు తగ్గించిన విషయం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో సూర్య ఘర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని ఆమె నిర్వహించారు. 2026-27 నాటికి దేశవ్యాప్తంగా ఒక కోటి గృహాలకు రూఫ్‌టాప్ సౌర వ్యవస్థలను ఏర్పాటు చేయడం ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో లక్ష గృహాలకు సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసే విధంగా జిల్లా పరిషత్ సీఈఓ, డిఆర్డిఏ, మెప్మా పిడి, డిపిఓలకు లక్ష్యాలను ఖరారు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ గృహాలకు పూర్తిగా ఉచితంగా రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు అందిస్తోందని, ఈ గృహాలకు సోలార్ వ్యవస్థల ఏర్పాటు వేగవంతం చేసేలా ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూడా సూచించారు. 1 కిలోవాట్ సోలార్ ప్లాంట్ ధర రూ.70,000 కాగా రూ.30,000 సబ్సిడీ లభిస్తుందని, 2కిలోవాట్ ప్లాంట్ ధర రూ.1.40 లక్షలు కాగా రూ.60,000 సబ్సిడీ వర్తిస్తుందని, 3 కిలోవాట్ ప్లాంట్ ధర రూ.2.10 లక్షలు కాగా రూ.78,000 సబ్సిడీ పొందవచ్చని అధికారులు వివరించారు. జీఎస్టీ తగ్గింపుతో యూనిట్ ధర మరింత తగ్గే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 92,469 మంది పిఎం సూర్య ఘర్ కోసం రిజిస్టర్ అయ్యారని, అందులో 81,591 మంది ఎస్సీ, ఎస్టీ లు, 10,878 మంది ఇతర వర్గాలు ఉన్నారని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ప్రదీప్ కుమార్ వివరించారు.



# ప్రజల భాగస్వామ్యమే ప్రగతికి సోపానం

**- జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి**

**కర్నూలు విద్య, డిసెంబరు 4, ప్రభాతవార్త:** ప్రజలు చైతన్యవంతులై ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యులవ్వాలని ప్రజల భాగస్వామ్యమే ప్రగతికి సోపానమని జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్‌ను విజయవంతం చేయాలని, ఈ ఏడాది పదవతరగతి పరీక్షల్లో జిల్లాను ప్రధమస్థానంలో నిలపడానికి ఈసభ కీలకం కావాలని, డిసెంబరు 6 నుండి అమలు కానున్న 100 రోజుల ప్రణాళికకు సంబంధించి ముఖ్యంగా సి మరియు డి గ్రేడ్ విద్యార్థుల పట్ల సమావేశంలో చర్చ జరగాలి. వందరోజుల ప్రణాళిక అమలయ్యేందుకు చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లు, చర్యలు పాఠశాల సిబ్బంది భాగస్వామ్యంతో చర్చజరగాలి. పదవతరగతి చదువుతున్న ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ అవ్వకుండా పటిష్టమైన చర్యలు ఈసమావేశంలో తీర్మానించాలి. ప్రభుత్వ నిర్వహిస్తున్న మధ్యాహ్నభోజన నాణ్యతపై విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడాలి. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతిఒక్కరు హాజరయి సమావేశాన్ని విజయవంతం చేయాలి.

# షాధిఖాన భవన నిర్మాణ పనులు పరిశీలన



**బనగానపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:** పట్టణంలోని ముస్లీం మైనార్టీ సోదరుల కోసం నిర్మిస్తున్న షాధిఖాన భవన నిర్మాణ పనులను రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈసందర ్భంగా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ పెండింగ్ పనులు పూర్తిచేసి వీలైనంత త్వరలో షాధిఖాన భవనాన్ని ముస్లీం సోదరులకు అంకితం చేస్తామన్నారు.

# డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**పత్తికొండ, డిసెంబరు 4, ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలో రూ.19.60 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని నియోజకవర్గం శాసనసభ్యులు కేఈ శ్యామ్‌కుమార్ గురువారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు డివిజనల్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలన్నింటిని ఒకే గొడుగు కిందకు తీసుకొని రావడమే ప్రభుత్వ ఉద్దేశ్యమని, జిల్లాలో కలెక్టరేట్ తరువాత మినీ కలెక్టరేట్ స్థాయిలో ఈ ఆఫీసులు పని చేస్తాయని, ఇందుకు వీలుగా డి.డి.ఓ, జాబ్‌చాట్‌కు సవరణలు చేసి జీవో 58ని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆర్డీవో భరత్ నాయయక్ అడ్మినిస్ట్రేషన్ అభివృద్ధి అధికారి స్వర్ణలత, డిఈ శేషప్ప, ఏఈ అబ్బా వెంకటేష్, ఏపివో వెంకటేశ్వర్లు, డిప్యూటి ఎంపిడివో నరసింహుడు, పత్తికొండ, ఎంపిడివో, తుగ్గలి ఎంపిడివో, దేవనకొండ ఎంపిడివో, ఆలూరు ఎంపిడివో, చిప్పగిరి ఎంపిడివో, హాలార్వి ఎంపిడివో, గ్రామ సచివాలయాల సిబ్బంది, టిడిపి నాయకులు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, మాజీ శాలివాహన చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, సాంబశివారెడ్డి, చౌదరి, తిరుపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు,.

# నేడు తిమ్మాపురానికి ఎమ్మెల్యే బుడ్డా

**మహానంది, డిసెంబరు 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తిమ్మాపురం మోడల్‌స్కూల్‌లో జరిగే మెగా పేరెంట్స్ సమావేశానికి శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఎంఈవో రామసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈసమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు.

# పాముకాటుకు గురై విద్యార్థి మృతి

**కౌతాళం, డిసెంబరు04, ప్రభాతవార్త;** మండంలోని చిరుపతల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి కె.అర్జున్ పాముకాటుకు గురై మృతిచెందారు. విద్యార్థి మృతదేహాన్ని ఎంఈఓ-2 శోభారాణి, క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్ గురువారం సందర్శించి నివాళులు అర్పించారు. విద్యార్థి తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థి మృతి బాధాకరమని వారు వాపోయారు. బాధితా కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు.




# డివిజినల్ అభివృద్ధి కార్యాలయం ప్రారంభం.. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

**: కూటమి ప్రభుత్వంలో అధికారులు ప్రజలకు పెరుగైన సేవలు అందించాలి**

**ఆత్మకూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త:** శ్రీశైలం నందికొట్కూరు నియోజకవర్గాల ప్రజల అభివృద్ధి కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామ పంచాయతీల ద్వారా ప్రజలకు అధికారులు మెరుగైన సేవలు అందించే విధంగా నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండల పరిధిలోని బాపనంతాపురం గ్రామంలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన ఆత్మకూరు డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఘనంగా ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే కు ఆత్మకూరు మండల అధికారులు పూల బొకేలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కొత్త కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, పూజా కార్యక్రమాలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యాలయాన్ని సందర్శించి విభాగాల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కీలక కేంద్రంగా ఈ కార్యాలయాన్ని తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల అమలు వేగవంతం చేయడానికి ప్రత్యేకంగా డివిజనల్ స్థాయిలో డిడిఓ కార్యాలయం ఎంతో ముఖ్యమన్నారు. గ్రామీణ



ప్రాంతాల నుంచి ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన రోజులు ఇక ఉండవని ఈ కార్యాలయం ఏర్పాటుతో ప్రజలకు సేవలు మరింత చేరువలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు అభివృద్ధి పనుల తనిఖీ పల్లెస్థాయి పథకాల అమలు, నిధుల వినియోగంపై పర్యవేక్షణ ఈ అన్నింటినీ సమన్వయం చేసే కేంద్రంగా డిడిఓ కార్యాలయం నిలుస్తుందని చెప్పారు. అభివృద్ధి పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. నీటి పారుదల రహదారులు విద్య వైద్యం వంటి రంగాల్లో ప్రగతి సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో అవసరాలను స్వయంగా తెలుసుకుని పరిష్కారం కోసం అధికారులు తగిన చర్యలు తీసుకునేలా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల వివరాలను ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. నూతనంగా ప్రారంభించిన డిడిఓ కార్యాలయంలో పనిచేయబోయే సిబ్బందికి ఎమ్మెల్యే ప్రత్యేక సూచనలు చేస్తూ ప్రజలు కార్యాలయానికి వచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సమయానుసారంగా సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గతంలో ఉన్నట్లుగా యాంత్రికంగా కాకుండా పారదర్శకంగా ప్రయోజనకరంగా అమలవ్వాలని అధికారులకు ఆదేశించడం జరిగిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి నాగజ్యోతి, తహసిల్దార్ రత్న రాధిక, మండల వ్యవసాయ శాఖ అధికారి హేమలత, ఎంపీడీవో నాగేంద్రుడు, అర్బన్ సీఐ డి.రాము, మండల ఎంపీపీ తిరుపాలమ్మ, బాపనంతాపురం గ్రామ సర్పంచ్ దర్గయ్య ,మండల పార్టీ అధ్యక్షుడు ఆర్ రవీంద్రబాబు, మండల ప్రధాన కార్యదర్శి షేక్ నబి, మండల పార్టీ సీనియర్ నాయకులు శివప్రసాద్ రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహణ కార్యదర్శి వెన్న శ్రీధర్ రెడ్డి, ఆర్యవైశ్య నాయకులు కొప్పారపు రవి, మండల క్లస్టర్ ఇంచార్జ్ ఎం.రాజేంద్రనాథ్ రెడ్డి, టిడిపి పట్టణ మహిళా నాయకురాలు శిరీష, మరియు డిడిఓ కార్యాలయ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు.

# పెద్ద హరివాణం జోలికొస్తే.. ఖబర్దార్..!

**: పెద్ద హరివనం మండల సాధన కమిటీ సభ్యులు**

**ఆదోని డిసెంబర్ 04 ప్రభాతవార్త:** ఆదోని జిల్లా సాధన కోసం ఉద్యమం రోజురోజుకు తీవ్రం అవుతుంది జిల్లా ప్రకటన రాకమునుపే ఆదోని నియోజకవర్గం లో పెద్ద హరివాణం గ్రామాన్ని చుట్టుపక్కల గ్రామాలను కలిపి మండలంగా ప్రభుత్వం ప్రకటిస్తున్నట్లు జీవో విడుదల చేసింది విన్నపాలు అభ్యంతరాలు తెలుపుకునేందుకు నెల గడువు విధించింది ఆలూరు రోడ్ లో ఉన్న దాణాపురం నారాయణపురం చాగి నాగనాతనహళ్లి గ్రామాలతో పాటు గణేకల్, మధిర చిన్నాహరివనం చిన్న గోనెహాలు గ్రామస్తులు బగ్గుమన్నారు పెద్దహరివాణం మండలంలో తమ గ్రామాలు కలప వద్దు అంటూ ఎవరికి వారే నిరసనలు వ్యక్తం చేస్తున్నారు కలెక్టర్ పర్యటనలో బుధవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద గ్రామస్తులు కలెక్టర్ సిరిని అడ్డుకున్నారు దీంతో వివాదం మరింత ముదిరింది పెద్ద హరివాణం గ్రామం పట్ల టిడిపి నాయకుడు చిన్న గోనెహాల గోపాల్ రెడ్డి కించపరిచేలా వ్యాఖ్యానించారని క్షమాపణ చెప్పాలంటూ పెద్ద హరివాణం గ్రామస్తులు బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం వ్యక్తం చేశారు. పెద్ద హరివాణం జోలికొస్తే.... గోపాల్ రెడ్డి ఖబర్దార్... అంటూ సవాల్ విషయారు. తమ గ్రామం సాంప్రదాయాలు కట్టుబాట్లు గురించి ఆయన చాలా చులకనగా మాట్లాడారని బహిరంగ క్షమాపణ చెప్పకపోతే చూస్తూ ఊరుకోమని ముక్కుముడిగా గ్రామస్తులు నినాదించారు తమ గ్రామంలో కలిపేందుకు ఇష్టం లేని వారిని తొలగించాలని పెద్ద హరివణం మండల సాధన కమిటీ నాయకులు ఆదినారాయణ రెడ్డి మధు పరమేష్ నాగరాజు మారెప్ప సర్పంచ్ రాము, బండి తిమ్మప్ప ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం ఇచ్చారు ఎవరిని తాము బలవంతం చేయలేదని ప్రభుత్వమే జాబితా తయారు చేసి పంపిందని పెద్ద హరివానం మండలం ఏర్పాటు ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం మానుకోవాలని



కోరారు. చోద్యం చూసిన పాలకులు ఆదోని నియోజకవర్గం మూడు నుంచి నాలుగు మండలాలు ఏర్పాటు చేయాలని ముందు ముందుగా కోరారు పెద్ద హరివాణం మండలం ప్రకటన అనంతరం నాయకుల నోటి నుండి మిగతా గ్రామాల మండలాలు ఏర్పాటు మాట రాకపోవడంతో గ్రామాల మధ్య వివాదం పుంజుకుంది ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి కూటమి నాయకులు మీనాక్షి నాయుడు మల్లప్ప స్పష్టమైన హామీ ఇవ్వని పరిస్థితి నెలకొంది ఇలాగే చోద్యం చూడడంతో పెద్ద హరివనం గ్రామస్తులు ఇతర గ్రామాల జనం మధ్య మనస్పర్థలు పెరిగి వివాదాలకు తెర తీసే అవకాశం ఉందని ప్రభుత్వం కూడా స్పష్టమైన హామీ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు

# విలువలతో కూడిన రాజకీయం చేసిన మహానాయకుడు మద్దూరు సుబ్బారెడ్డి

- విద్య విలువను గుర్తించిన మద్దూరు సుబ్బారెడ్డి
- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

**నందికొట్కూరు, డిసెంబరు 4, ప్రభాతవార్త:** విలువలతో కూడిన రాజకీయం చేసిన మహనీయుడు స్వర్గీయ మాజీ మంత్రి, ఎం.పి. మద్దూరు సుబ్బారెడ్డి అని నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం బ్రాహ్మణకొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 64వ వార్షికోత్సవం ఎమ్మెల్యే సరస్వతిదేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం మద్దూరు సుబ్బారెడ్డి 113వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళీలు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఆనాడు విద్య విలువను గుర్తించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే



దక్కుతుందని, అధికారంలో ఉన్న లేక పోయిన ప్రజల కోసం పాటుపడిన ఏకైక వ్యక్తి మద్దూరు అని ఆయన కొనియాడారు. జిల్లాలో ఎంతో మందికి ఉద్యోగవకాశాలు కల్పించి వారి జీవితాలలో వెలుగు నింపారని ఆయన పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ మరియమ్మ, మాజీ ఎంపిటిసి ఖాజామొహీద్దీన్, మాజీ సర్పంచ్ కలీలుల్లాబేగ్, నందికొట్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్లా రబ్బానీ, మిడుతూరు టిడిపి మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, లక్ష్మినారాయణ, జనసేన నాయకులు ఎం.రామిరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పుల్లన్న, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు,

# ఉత్తమ ఫలితాలే లక్ష్యం..!

- కేజీబీవీలో విజయపథం ప్రణాళిక
- రోజూ స్టడీ అవర్స్ పరీక్షలు
- సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పర్యవేక్షణ



**హొలహర్వి, డిసెంబరు04, ప్రభాతవార్త;** ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్ పబ్లిక్ పరీక్షలపైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తేనే మంచి కళాశాలలో ఉన్నత చదువులు చదువుకోవడానికి అవకాశాలు ఉంటాయి. ప్రతిఏటా కోట్లాది రూపాయల వ్యయం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేజీబీవీ పాఠశాలల విద్యార్థినీలకు చదువులు నేర్పిస్తున్నారు. ప్రస్తుతం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఇక్కడ చదువుకునే విద్యార్థినీలకు ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో అధికార యంత్రాంగం విజయపథం పేరుతో ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది.

**- ప్రతిష్టాత్మకంగా విజయపథం**

ఆలూరు నియోజకవర్గంలో హొలహర్వి, ఆస్పరి, దేవనకొండ, హొళగుంద, చిప్పగిరి, ఆలూరు మండలాల్లో ఆరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు ఉన్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులకు 40 మంది విద్యార్థినీలు ఉంటారు. నియోజకవర్గంలో ఆరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థినీలు 240 మంది, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిసి 650 మంది విద్యార్థినీలు ఉన్నారు. పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే సమగ్ర శిక్ష యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం విజయపథం పేరుతో ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు.

**- ప్రణాళిక ఇలా..:**

ప్రతిరోజూ 5;30 గంటల నుంచి 7 గంటల వరకు, తిరిగి సాయంత్రం 7;30 గంటల నుంచి రాత్రి 10;30 గంటల వరకు స్టడీ అవర్స్. బోధించిన పాఠాలపై నిత్యం పరీక్షల నిర్వహణ, పరీక్షల్లో మార్కుల ఆధారంగా ఏ విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనకబడి ఉన్నారో గుర్తించడం, వెనకబడిన సబ్జెక్టులో పట్టు సాధించడానికి ఆయా పాఠ్యాంశాల్లో మెలుకువలు నేర్పించడం జరుగుతుంది. ప్రణాళికతో చదవడం ఎంతో ఉపయోగకరం- శైలు, విద్యార్థిని, పదో తరగతి, హొలహర్వి కేజీబీవీ పాఠశాల మంచి మార్కులతో అందరూ పాస్ కావడానికి నిర్వహిస్తున్న ఇజయపథం ప్రణాళిక ఎంతో ఉపయోగకరంగా ఉంది. నిత్యం చదువుపైనే దృష్టి పెడుతున్నాం. నిత్యం పరీక్షల నిర్వహణలో ఏ సబ్జెక్టులో వెనకపడ్డామో తెలిసిపోతుంది. ఆ సబ్జెక్టులపై మరింత శ్రద్ధ పెట్టి చదువుకుని మరింత మార్కులు తెచ్చుకోవడానికి అవకాశం ఉంది.

సామర్థ్యాలను గుర్తించవచ్చు- పద్మావతి, ప్రిన్సిపాల్, కేజీబీవీ, హొలహర్వి

పదో తరగతి, ఇంటర్ విద్యార్థినీలు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలనే ఆశయంతో చదువులు చెబుతున్నాం. ప్రత్యేక ప్రణాళిక వల్ల విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించడానికి వీలవుతుంది. వెనకబడిన సబ్జెక్టుల్లో మెలుకువలు నేర్పించి మరింత ముందుకు తీసుకెళ్లగలం. దీంతో మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.



# మూసుకుపోయిన హృదయ ధమని తెరిచిన అరుదైన విజయం



**కర్నూల్ హాస్పిటల్ డిసెంబర్ 4 ప్రభాతవార్త :** యశోద సోమాజిగూడలో 100 సి టి ఓ ను రిట్రోగ్రేడ్ పద్ధతితో విజయవంతంగా చికి త్సకర్నూలుకు చెందిన 60 ఏళ్ల రోగిలో పూర్తిగా మూసుకుపోయిన హృదయ ధమని (సి టి ఓ) ను యశోద ఆసుపత్రి, సోమాజిగూడలో డాక్టర్ ఏ. గురు ప్రకాష్ బృందం విజయవంతంగా తెరిచింది. సాధారణ మార్గంలో స్టెంట్ పెట్టడం సాధ్యం కాకపోవడంతో, క్లిష్టమైన రిట్రోగ్రేడ్ టెక్నిక్ ఉపయోగించి ధమనిలో రక్తప్రసరణ పునరుద్ధరించారు. శస్త్రచికిత్స అవసరం లేకుండానే చికిత్స పూర్తవడంతో రోగి మరుసటి రోజే నడిచే స్థితికి చేరుకున్నారు.

# మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం, పని ఒత్తిడి తగ్గిపుకు క్రీడలు

**నంద్యాల, డిసెంబరు 4, ప్రభాతవార్త ప్రతినిధి:**



63వ హోంగార్డ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హోంగార్డు సిబ్బంది మానసిక ఉల్లాసం కొరకు వివిధ కార్యక్రమాలు జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ అదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఎన్ యుగంధర్ బాబు ఆధ్వర ్యంలో నంద్యాల జిల్లాలోని హోంగార్డులకు హోంగార్ప్స్ రైసింగ్ డే సందర్భంగా మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం, పని ఒత్తిడి తగ్గించేందుకు వ్యూహాత్మకంగా ఆలోచన త్వరిత ప్రతిస ్పందనలు, వ్యక్తిగత లక్ష్యాలు, సాధన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు వాలిబాల్, వంద మీటర్ల రన్నింగ్ రేస్‌లు, మ్యూజికల్ చైర్ ఫర్ ఉమెన్, షాట్ ఫుట్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని పోటీల అనంతరం ఈనెల 6న జరిగే రైసింగ్ డే కార్య క్రమంలో జిల్లా ఎస్పీ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుంది. ఈకార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు బాబు, మంజునాథ్, సురేష్‌కుమార్, ఆర్ఎస్ఐలు ఉమా మహేశ్వర్‌రెడ్డి, దాదా పీరయ్య, మనోహర్‌లు పాల్గొన్నారు.

# పచ్చని గ్రామల్లో.. ఫ్యాక్షన్ మంటలు రేపకండి



**నంద్యాల, డిశంబరు 4, ప్రభాతవార్తప్రతినిధి** నంద్యాల మండలంలోని యస్.కొత్తపల్లె గ్రామం ఫ్యాక్షన్ గ్రామం గత 5సంవత్సరాల నుండి ప్రశాంత వాతావరణము కలిగి ఉన్న పరిస్థితిని నేడు టిడిపి నాయకులుదానిని తిరిగి ఫ్యాక్షన్ గ్రామంగా మారుస్తున్నారని వైసిపి పార్టీకి చెందిన యంపిటిసి హరినాదరెడ్డిపై హత్యాయత్నము చేయడము దుర్మార్గమైన చర్యలని ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని నంద్యాల జిల్లా వైసిపి పార్టీ అధ్యక్షలు కాటసానిరాంభూపాల్‌రెడ్డి నంద్యాల మాజీ యంయల్ఏ శిల్పారవిచంద్రకిశరెడ్డి ఎమ్మెల్సీ ఇస్సాకు బాషలు అన్నారు. నంద్యాల పట్టణంలోని యన్ఐటి సీలో మెరుగైన చచికిత్స పొందుతునక్న యంపిటిసి సభ్యులు హరినాదరెడ్డిని కుటుంబసభ్యులను కలిసి గురువారము నంద్యాల .జిల్లా వైసిపి అధ్యక్షులు, నంద్యాల మాజీ యంయల్ఎ శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాకుబాషలు పరామర్శించి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి పార్టీ ప్రదాన కార్యదర్శి పిపి.మదుసూదనరెడ్డి మున్సుపల్ చైర్మన్ మాబున్నీసా, వైసిపి జిల్లా విభాగం సభ్యులు వైసిపి నాయకులు పాల్గొన్నారు. ఈసంద్బముగా ఏర్పాట్లు చేసిన విలేకర్ల సమావేషములో వారు మాట్లాడుతూ నంద్యాల నియోజక వర్గంలో ప్రశాంత వాతావర్ణములో ఉన్న పరిస్థితుల్లో టిడిపి నాయకులు అధికారములోకి వచ్చిన నాటి నుండి వైసిపి కార్యకర్తలపై దాదులు, హత్యలు దౌర్జన్యాలే చేస్తూ అరాచకాలు చేస్తు ప్రజలను భయ బ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామల్లో దాదులు హత్యలు హత్యాయత్నాలు చేస్తూ అదిపత్యాన్ని సాదించేందుకు చేస్తున్న దుర్మార్గమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# ప్రభుత్వం హామీలపై వేగం పెంచండి

**: పెండింగు అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తి చేయండి**

**నంద్యాల, డిశంబరు 4, ప్రభాతవార్తప్రతినిధి** 2014నుండి గవర్నమెంటు అస్యూరెన్సెస్‌కు సంబందించిన పెండింగు పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని లెజిస్లేటివ్ కౌన్సిల్ కమిటి చైర్మన్ ఇసాక్‌బాషా అధికారులకు సూచించారు. గురువారము నంద్యాల కలెక్టరేట్‌లోనివీడియో కాన్ఫరెన్సు హాల్లో లెజిస్లేటివ్ కౌన్సిల్ కమిటి చైర్మన్ సభ్యులు మరియు సంబందిత విభాగాలఅధికారులతో సమీక్ష సమావేషము నిర్వహించారు. సమావేషములో కౌన్సిల్ కమిటి సభ్యులు కాపురుశ్రీనివాస్‌యం విరామ చంద్రారెడ్డి జాయింట్ సెక్రటరీ సుబ్బారెడ్డి మున్సుపల్ కమీషనర్లు ఇరిగేషన్ ,దేవదాయ ,మైనార్టి సంక్షేమ శాఖల అదికారులు పాల్గొన్నారు. ఈసందర్భముగాలెజిస్లేటివ్ చైర్మన్ మాట్లాడుతూ 2014నుండి గవర్నమెంటు అస్యూరెనేస్‌కు సంబందించిన పెండింగు పనులను నిర్దష్ట గడువుల్లో పూర్తి చేయాలని అదికారులకు అదేశాలు జారీ చేశారు. స్లాటెడ్ హౌసింగ్ కోసం అవసరమైన పట్టణాల్లోస్థలాల గుర్తింపు పాడైపోయన నిర్మాణాల మరమ్మత్తులు కొత్త స్లాటెడ్ హౌసెస్ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అమలు కోసం మార్గదర్శకాలు వచ్చిన వెంటనే జిల్లాలో అమలు కార్యక్రమాలు ప్రారంబించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.